తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట యాద్రాద్రి భువనగిరి
బుధవారం 07 అక్టోబర్ 2026
పేజీలు : 8
Follow :

## 27 లక్షల మందికి ఏకకాలంలో అల్పాహారం..

# ప్రపంచంలో ఎక్కడా లేదు

○ తెలంగాణలోనే తొలిసారి ○ విద్యార్థుల పౌష్టికాహారంపై ప్రత్యేక దృష్టి ○ బీఆర్ఎస్‌కు గతమే తప్ప భవిష్యత్తు లేదు.. మళ్లీ వచ్చేది ఎందుకో చెప్పాలి ○ సంక్షేమం ఉచితం కాదు.. రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధికి పెట్టుబడి ○ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

వార్తా లోపలి పేజీలో





## 2,500 మంది విద్యార్థులతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్

### కలెక్టర్ చంద్ర శేఖర్

**నల్లగొండ ప్రతినిధి,అక్టోబర్ 6,(జనం సాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. ఇందులో భాగంగానే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నట్లు తెలిపారు.మిర్యాలగూడ నియోజకవర్గానికి మంజూరైన పాఠశాల నిర్మాణానికి మంగళవారం మిర్యాలగూడ మండలం జప్తి వీరప్పగూడెం గ్రామంలోని సర్వే నంబర్ 214లో సుమారు 20 నుంచి 25 ఎకరాల స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణానికి అనువైన స్థల వివరాలు, లేఅవుట్లు, భూ రికార్డులను సమర్పించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రికార్డులను పూర్తిగా పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ పాఠశాలలో ఒకే ప్రాంగణంలో 2,500 మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా తరగతి గదులు, డార్మెటరీలు, కిచెన్, డైనింగ్ హాల్, ల్యాబ్‌లు, లైబ్రరీ, ఆట స్థలాలు తదితర అన్ని సౌకర్యాలను కార్పొరేట్ తరహాలో ఏర్పాటు చేయనున్నారు.కలెక్టర్ వెంట మైనింగ్ ఏడీ రవికుమార్, ఆర్ఐలు రామకృష్ణ, కృష్ణయ్య, డిప్యూటీ సర్వేయర్ శ్రీనివాస్ రెడ్డి, సర్వేయర్లు శ్రీనివాస్, సైదులు, నరసింహ తదితరులు ఉన్నారు.

## గిరిజన సంక్షేమం.. మహిళలు, రైతులకు ఆర్థిక భరోసా

○ విద్యార్థుల భవిష్యత్తుకు ప్రత్యేక ప్రణాళికలు అమలు
○భద్రగిరి మార్ట్ ద్వారా గిరిజన మహిళల ఉత్పత్తులకు మార్కెటింగ్
○ ఐటీడీఏ పీవో బి. రాహుల్

వార్తా లోపలి పేజీలో

## సూర్యాపేటకు మంజూరైన బుల్లెట్ ట్రైన్ ను అడ్డుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వరరావు

వార్తా లోపలి పేజీలో



## పులిచింతల హైడ్రల్ పవర్ ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన మంత్రులకు స్వాగతం

**మేళ్లచెరువు, అక్టోబర్ 6 (జనంసాక్షి):** సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలోని పులిచింతల హైడ్రల్ పవర్ ప్రాజెక్టును మంత్రులు సందర్శించారు.రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రాజెక్టు పరిశీలనకు వచ్చారు.ఈ సందర్భంగా మేళ్లచెరువు మాజీ ఎంపీపీ కొట్టే పద్మ సైదేశ్వరరావు వారికి ఘన స్వాగతం పలికారు.మంత్రులను శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు.ప్రాజెక్టు అభివృద్ధి, విద్యుత్ ఉత్పత్తి తదితర అంశాలపై మంత్రులు అధికారులతో సమీక్షించారు.

## భద్రాద్రి ఆలయ పునర్నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

○ నమూనా, బడ్జెట్, పూర్తిచేసే గడువును బహిర్గతం చేయాలి
○ ఉమ్మడి జిల్లాకు ముగ్గురు మంత్రులున్నా భద్రాచలానికి ఈ దుస్థితి బాధాకరం
○ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కిళ్లపల్లి రవీందర్ డిమాండ్



**భద్రాచలం అక్టోబరు 06 (జనంసాక్షి):** దేశ విదేశాల నుంచి నిత్యం వేలాది మంది భక్తులు సందర్శించే భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ పునర్నిర్మాణ పనులను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కిళ్లపల్లి రవీందర్ డిమాండ్ చేశారు. ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించిన నమూనా, ప్రణాళిక, బడ్జెట్, పనులు పూర్తయ్యే కాలపరిమితి వివరాలను ప్రభుత్వం, అధికారులు ప్రజలకు బహిర్గతం చేయాలని కోరారు. మంగళవారం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి భద్రాచలం రామాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్సీ రవీందర్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ వైదిక సిబ్బంది వేద ఆశీర్వచనం అందించగా, దేవస్థానం ఏఈవో శ్రావణ్‌కుమార్, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా తీర్థ ప్రసాదాలు అందజేశారు.తదనంతరం విలేకరులతో మాట్లాడిన రవీందర్.. ప్రభుత్వం చేపట్టిన పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగంగా గర్భగుడి మినహా ఇతర నిర్మాణాలను తొలగించినప్పటికీ, తదుపరి పనుల్లో ఆశించిన వేగం కనిపించడం లేదన్నారు. పునర్నిర్మాణానికి సంబంధించి ఏ స్థాయి ప్రణాళికలు సిద్ధం చేశారు, ఎంత బడ్జెట్ కేటాయించారు, ఎప్పటిలోగా పనులు పూర్తి చేస్తారనే విషయాలపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. యాదాద్రి తర్వాత రాష్ట్రంలో అత్యంత కీలకమైన పుణ్యక్షేత్రంగా భద్రాచలానికి ప్రత్యేక గుర్తింపు ఉందని, ఇలాంటి ప్రాంతంలో నిర్మాణ పనులు దీర్ఘకాలం పెండింగ్‌లో ఉండటం సరికాదన్నారు. వర్షాకాలంలో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పనుల పురోగతి, బాధ్యులైన అధికారులు, పూర్తిచేసే గడువు వంటి వివరాలు ప్రజలకు అందుబాటులో లేకపోవడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. సంబంధిత శాఖలు, కాంట్రాక్టర్లు, ఉమ్మడి జిల్లాకు చెందిన

వార్తా లోపలి పేజీలో

# పట్టభద్రులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలి

**బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మున్న మల్లయ్య యాదవ్**



నూతనకల్ అక్టోబర్ 6 ( జనంసాక్షి) నూతనకల్ మండల వ్యాప్తంగా పట్టభద్రులు ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మున్న మల్లయ్య యాదవ్ తెలిపారు.మంగళవారం జనం సాక్షితో మాట్లాడుతూ గతంలో ఓటు హక్కు కలిగిన వారు కూడా ఓటును నమోదు చేసుకోవాలని, నవంబర్ 11 లోపు నమోదు చేసుకుని బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని వారు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో నిరుద్యోగులకు 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి గద్దెనెక్కిన ప్రభుత్వం, నిరుద్యోగులను మోసం చేసిందని,ఈ ప్రభుత్వానికి చంపపెట్టులా కాంగ్రెస్ పార్టీని ఓడించి,ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు పట్టభద్రులను కోరారు.




## యాంటీబయాటిక్స్ వినియోగంపై ఫార్మసీ విద్యార్థుల అవగాహన ర్యాలీ

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 6 (జనంసాక్షి): యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్)పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విజ్ఞాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ దేశ్‌ముఖి ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం పిల్లాయిపల్లి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఫార్మసీ విద్యార్థులు ర్యాలీలో పాల్గొని ప్రదర్శనల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కళాశాల సీఈఓ శ్రవణ్, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. శ్రీనివాసమూర్తి, సంస్థాగత నోడల్ అధికారి డాక్టర్ బి. ప్రభాకర్‌రెడ్డి పర్యవేక్షణలో, ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) మార్గదర్శకాల మేరకు ర్యాలీ నిర్వహించారు. వైద్యుల సూచన లేకుండా యాంటీబయాటిక్స్ వినియోగించవద్దని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పి మహాలక్ష్మి దానయ్య, డాక్టర్ కె. కిషోర్ గౌడ్, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# భద్రాద్రి ఆలయ పునర్నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

ముగ్గురు మంత్రులు ఆలయ పునర్నిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టి సారించి, సకాలంలో పనులు పూర్తయ్యేలా పూర్తి బాధ్యత తీసుకోవాలని రవీందర్ కోరారు.

**ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్యంపై అసంతృప్తి**

ఎమ్మెల్సీ రవీందర్ వేకువజామున మార్నింగ్ వాకింగ్ చేస్తూ ఆలయ నిర్మాణ పనులతో పాటు పరిసర ప్రాంతాల్లోని డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. ఆలయ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, పారిశుద్ధ్య లోపాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రామభక్తులు అధికంగా సంచరించే ప్రాంతాల్లో కనీస పారిశుద్ధ్య పనులు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతోందని విమర్శించారు. ఆలయం చుట్టుపక్కల చెత్త పేరుకుపోవడంతో ప్రాంతం కళావిహీనంగా మారిందన్నారు. వెంటనే జిల్లా పంచాయతీ అధికారులు ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టి ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం బీఆర్ఎస్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ, కోటగిరి ప్రబోధ్‌కుమార్, గోసుల శ్రీను, రావులపల్లి పృథ్వీ, కావూరి సీతామహాలక్ష్మి, గోళ్ల గణేష్, గొట్టిముక్కల సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

## గెస్ట్ ఫ్యాకల్టీ మెరిట్ జాబితాపై అభ్యంతరాలకు అవకాశం



భద్రాచలం అక్టోబరు 06 (జనంసాక్షి) ఖమ్మం రీజియన్ పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2026?27 విద్యా సంవత్సరానికి తాత్కాలిక ప్రాతిపదికన గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి సిద్ధం చేసిన తాత్కాలిక మెరిట్ జాబితాలపై అభ్యంతరాలను స్వీకరిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ తెలిపారు. గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తాత్కాలిక మెరిట్ జాబితాలను పరిశీలించుకోవాలని సూచించారు. తమ పేరు, విద్యార్హతలు, మెరిట్, నెట్, సెట్, పీహెచ్‌డీ తదితర వివరాల్లో ఏవైనా తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే, తగిన ధ్రువపత్రాలతో సమర్పించాలని కోరారు.

**రేపటితో అభ్యంతరాల గడువు**

అభ్యంతరాలను అక్టోబరు 7వ తేదీ వరకు కార్యాలయ పనిదినాల్లో భద్రాచలంలోని ఐటీడీఏ గురుకుల ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయంలో నేరుగా సమర్పించాలని తెలిపారు. అభ్యంతరాలకు సంబంధించిన ధ్రువపత్రాల నకళ్లను తప్పనిసరిగా జత చేయాలని స్పష్టం చేశారు. నిర్ణీత గడువు అనంతరం అందే అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోబోమని పేర్కొన్నారు. అందిన అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం అర్హతలు, నియామక నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపడతామని రాహుల్ తెలిపారు. ఇతర వివరాలకు 8500136628 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

# గిరిజన మహిళల జీవితాల్లో అక్షర జ్యోతి

○ విద్యాబోధనకు ఐటీడీఏ ప్రత్యేక కార్యాచరణ

○ ఐటీడీఏ పీఓ బి.రాహుల్



భద్రాచలం అక్టోబరు 06 (జనంసాక్షి) మారుమూల గిరిజన గ్రామాల్లో చదువుకు దూరమైన మహిళలకు తిరిగి విద్యాబోధన అందించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ తెలిపారు. వయోజన విద్య, న్యూ ఇండియా లిటరసీ ఉల్లాస్, తెలంగాణ ఓపెన్ స్కూల్ ద్వారా మహిళలకు చదవడం, రాయడం వంటి ప్రాథమిక విద్యతో పాటు ఉన్నత విద్యను కొనసాగించే అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. మంగళవారం భద్రాచలంలోని తన ఛాంబర్‌లో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ఉల్లాస్, తెలంగాణ ఓపెన్ స్కూల్ ప్రచార పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు, ఇతర కారణాలతో మధ్యలో చదువు మానివేసిన గిరిజన మహిళలను గుర్తించి వారికి విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో డీఆర్‌డీఏ స్వయం సహాయక సంఘాల మహిళల సహకారంతో మారుమూల గ్రామాల్లో చదువుకు దూరమైన మహిళలను గుర్తించి వయోజన విద్య ద్వారా చదవడం, రాయడం నేర్పించడంతో పాటు పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే నిర్వహించిన కార్యక్రమాల ద్వారా సత్ఫలితాలు సాధించామని తెలిపారు. ప్రస్తుతం ఏడో తరగతి వరకు చదివి మధ్యలో విద్యను నిలిపివేసిన మహిళలతో పాటు పదో తరగతి తర్వాత ఇంటర్మీడియట్ చదవలేకపోయిన వారు, వివిధ కారణాలతో చదువుకు దూరమైన వారిని గుర్తించి ఉల్లాస్, తెలంగాణ ఓపెన్ స్కూల్ కార్యక్రమాల ద్వారా నిష్ణాతులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన అందించనున్నట్లు వెల్లడించారు. దసరా సెలవుల సందర్భంగా ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులు తమ ఇళ్లకు వెళ్లినప్పుడు తల్లిదండ్రులతో పాటు పరిసర గ్రామాల్లో చదువుకు దూరమైన మహిళల వివరాలను సేకరించేలా వారికి అవగాహన కల్పిస్తామని రాహుల్ తెలిపారు. అలాగే పంచాయతీ కార్యదర్శుల సహకారంతో నిరక్షరాస్య మహిళలను గుర్తించి కార్యక్రమంలో భాగస్వామ్యం చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్యా డైరెక్టర్ రాజేంద్రప్రసాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన సంక్షేమం.. మహిళలు, రైతులకు ఆర్థిక భరోసా

○ విద్యార్థుల భవిష్యత్తుకు ప్రత్యేక ప్రణాళికలు అమలు ○ భద్రగిరి మార్ట్ ద్వారా గిరిజన మహిళల ఉత్పత్తులకు మార్కెటింగ్ ○ ఐటీడీఏ పీవో బి. రాహుల్



భద్రాచలం అక్టోబరు 06 (జనంసాక్షి) మారుమూల గిరిజన ప్రాంతాల్లో నివసించే ఆదివాసీ కుటుంబాల సంక్షేమంతో పాటు మహిళలు, రైతులను ఆర్థికంగా చేయూత అందించేందుకు ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు పీవో బి. రాహుల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు జీసీసీ ద్వారా చేపడుతున్న కార్యకలాపాలను ఆయన వారికి వివరించారు. గిరిజన మహిళలు తయారు చేస్తున్న పోషకాహార ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు భద్రగిరి మార్ట్ ఏర్పాటు చేశామని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేస్తున్న మిల్లెట్ మ్యాజిక్ బిస్కెట్లకు మంచి ఆదరణ లభిస్తోందన్నారు. ఇప్పపువ్వు లడ్డూలు, బర్ఫీలు, చాక్లెట్లు, ఇప్ప నూనె, అటవీ ఉత్పత్తులు, సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను కూడా భద్రగిరి మార్ట్‌లో అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. జీసీసీ ద్వారా ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలకు నిత్యావసర సరుకులు సరఫరా చేస్తున్నామని, గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో పెట్రోల్ బంకులను కూడా ఏర్పాటు చేసినట్లు రాహుల్ వివరించారు. విద్యకు ప్రత్యేక ప్రాధాన్యం గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నామని పీవో తెలిపారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు 'ఉద్దీపకం' వర్క్‌బుక్‌లను ప్రవేశపెట్టడంతో విద్యార్థుల విద్యా ప్రమాణాలు, పాఠశాలల హాజరు శాతం మెరుగుపడిందన్నారు. గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో ఐఐటీకి 15 మంది, నీట్‌కు 25 మంది, ఎంబీబీఎస్‌కు 8 మంది ఎంపిక కావడం గిరిజన విద్యార్థుల ప్రతిభకు నిదర్శనమన్నారు. ఉన్నత విద్యలో రాణిస్తున్న విద్యార్థులకు ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు.

**- గిరిజన సంస్కృతికి పరిరక్షణ**

గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు గిరిజన మ్యూజియాన్ని ఏర్పాటు చేశామని రాహుల్ తెలిపారు. గిరిజనుల గోత్రాలు, ఇలవేల్పుల వివరాలను భద్రపరిచే గ్రంథాన్ని కూడా రూపొందించినట్లు చెప్పారు. ఇదిలా ఉండగా, రాష్ట్రంలోని ఐటీడీఏ పరిధిలోని గిరిజన గ్రామాల్లో పర్యటించి స్వయం ఉపాధి పొందుతున్న మహిళలను గుర్తించడం, వారు తయారు చేస్తున్న ఉత్పత్తుల వివరాలను సేకరించి మరింత అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు తమ బృందం పర్యటిస్తోందని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎం జీసీసీ రామానందం, ఫారెస్ట్ పాల్వంచ డివిజన్ మేనేజర్లు మాధవి, విజయకుమారి, ప్లాంట్ మేనేజర్లు సురేష్‌కుమార్, లక్ష్మారెడ్డి, వెంకటేశ్వర్లు, జీసీసీ మేనేజర్లు జయరాజ్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ నినో కరువుపై ప్రభుత్వాలు స్పందించాలి

**హుజూర్‌నగర్, అక్టోబర్ 6 (జనంసాక్షి):**
ఎల్ నినో ప్రభావంతో ఏర్పడిన కరువు పరిస్థితులపై హుజూర్‌నగర్‌లోని హనుమా లింగయ్య భవన్‌లో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం కంబాల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఒక్కవంతుల కోటేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ దేశమంతా కరువు కరాళ నృత్యం చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధం గా లేవని అన్నారు. ప్రకృతి విపత్తులో తీసు కోవాల్సిన చర్యలు వెంటనే చేపట్టాలని కోరారు. కరువు సహాయక చర్యలపై మంగళవారం ఆర్డీవో కు వినతిపత్రం సమర్పించారు. అందులో డిమాండ్లు:

1. వేసిన పంటలను కాపాడేందుకు ఎడమ కాలువ ద్వారా 6 టీఎంసీల నీటిని తక్షణమే విడుదల చేయాలి
2. నాణ్యమైన 3 ఫేజ్ కరెంట్ 24 గంటలు సరఫరా చేయాలి



3. రాష్ట్ర ప్రభుత్వం అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేసి కేంద్రానికి నివేదించాలి
4. ఎండిన వరికి ఎకరాకు రూ.30 వేలు, మిర్చి, పత్తికి రూ.50 వేలు పరిహారం ఇవ్వాలి
5. బీడు పొలాలు, అపరాలు, కూరగాయలకు ఎకరాకు రూ.20 వేలు ఇవ్వాలి
6. ఉపాధి హామీ పథకాన్ని ఏడాది పొడవునా కొనసాగించాలి
7. పెండింగ్ డీఏలు వెంటనే అమలు చేయాలి
8. జాతీయ విపత్తుగా ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలి. ఈ కార్యక్రమంలో ఎల్లావుల రాములు, గుండు వెంకటేశ్వర్లు, కొప్పుల సైదిరెడ్డి, జక్కుల నాగేశ్వరరావు, కాకి అజయ్, మేకల కనకారావు, రేపాకుల మురళి, దొడ్డ వెంకటయ్య, కొప్పోజు సూర్యనారాయణ, బొల్లు ప్రసాద్, కౌన్సిలర్ చెన్నగాని సైదులు, సారెడ్డి పాపిరెడ్డి, పిన్నపురెడ్డి వెంకటరెడ్డి, పాశం వెంకట్ నారాయణ, జడ వెంకన్న, బంటు శ్రీనివాస సునీల్, ఉదయగిరి రామిశెట్టి కోటయ్య ఇందిరాల వెంకటేశ్వర్లు, జక్కుల రమేష్, నూకల చంద్రం, పాశం వీరబాబు, బత్తిని మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేటకు మంజూరైన బుల్లెట్ ట్రైన్ ను అడ్డుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం

## మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వరరావు

**సూర్యాపేట(జనంసాక్షి):**
సూర్యాపేటకు మంజూరైన బుల్లెట్ ట్రైన్ ను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటుందని మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వరరావు అన్నారు. జాతీయ రహదారి 65కు సమాంతరంగా బుల్లెట్ ట్రైన్, రైల్వే కారిడార్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బుల్లెట్ ట్రైన్ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలలో భాగంగా 54వ రోజు మంగళవారం వరుసగా రెండో రోజు బీజేపీ శ్రేణులు దీక్షలో పాల్గొన్నారు.సూర్యాపేట రూరల్ మండల అధ్యక్షులు అలుగుబెల్లి సైదిరెడ్డి, పెన్‌పహాడ్ మండల అధ్యక్షులు తాళ్లపల్లి మధు ఆధ్వర్యంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.కేంద్ర ప్రభుత్వం మొదట రూపొందించిన ఒకటి, రెండు అలైన్‌మెంట్ల ప్రకారం బుల్లెట్ ట్రైన్ మార్గం జాతీయ రహదారి 65కి సమాంతరంగా చౌటుప్పల్, సూర్యాపేట, కోదాడ మీదుగా వెళ్ళాల్సి ఉందని, దీని ప్రకారం సూర్యాపేటకు స్టేషన్ కూడా మంజూరైందన్నారు. కానీ, ప్రస్తుత రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా సూర్యాపేటను మీదుగా వెళ్లే రూటును మార్చి మూడవ ప్రతిపాదనను కేంద్రానికి పంపి సూర్యాపేట ప్రజలకు అన్యాయం చేస్తుందన్నారు.ఉమ్మడి నల్గొండ జిల్లాలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న సూర్యాపేటకు ఇప్పటి వరకు సరైన రైల్వే కనెక్టివిటీ లేదనే విషయాన్ని గుర్తించి, కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇక్కడి ప్రజలకు న్యాయం చేస్తూ స్టేషన్ మంజూరు చేస్తే, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం స్వార్థంతో రూట్ మార్పు ప్రతిపాదనలు పంపి అడ్డుపడు తోందన్నారు. ఈ అలైన్‌మెంట్ మార్పుపై కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక అధికార పార్టీ నాయకులు తమ వైఖరిని తక్షణమే స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లమల్ల నరసింహ, మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఎండి అబిద్ ,అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కీషన్, మండల అధ్యక్షులు మాదవరపు అనిల్, సర్పంచ్ సుందరి రామారావు,ఉప సర్పంచ్ లు సూర్యాపేట,పెన్ పహాడ్ మండలాల ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, సీనియర్ నాయకులు , మోర్చాల అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్చార్జిలు , బూత్ అధ్యక్షులు, బుల్లెట్ ట్రైన్ సాధన సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# బస్సులో విద్యార్థులపై టీచర్ దురుసు ప్రవర్తనపై తల్లిదండ్రుల ఆగ్రహం

**మేళ్లచెరువు జనంసాక్షి**
మేళ్లచెరువు: పాఠశాల బస్సులో ప్రయాణించే విద్యార్థులతో ఓ టీచర్ అసభ్యకరంగా మాట్లా డటంతో పాటు, విద్యార్థులను కొడుతున్నారంటూ తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై గతంలోనే పాఠశాల ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ మళ్లీ అదే తరహా ఘటనలు చోటుచేసుకుంటున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మేళ్లచెరువు మండల కేంద్రంలోని ఆరంజ్ స్కూల్ నుంచి బక్కం, మోతులగూడెం మీదుగా చౌటపల్లి వైపు వెళ్లే పాఠశాల బస్సులో ప్రతిరోజూ పలువురు విద్యార్థులు ప్రయాణి స్తున్నారు. ఈ బస్సులో విధులు నిర్వహించే ఓ టీచర్ విద్యార్థులను దురుసుగా తిడుతూ, అసభ్యకరమైన పదజాలంతో మాట్లాడటమే కాకుండా కొడుతున్నారని విద్యార్థులు ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు చెప్పినట్లు సమాచారం.సెప్టెంబర్ 5న పాఠశాల ముగిసిన అనంతరం బస్సులో విద్యార్థులను టీచర్ తిట్టడం, అసభ్యకరంగా మాట్లాడడం, కొట్టడం జరిగిందని విద్యార్థులు తమ తల్లిదండ్రులకు చెప్పడంతో విషయం




వెలుగులోకి వచ్చింది. దీంతో తల్లిదండ్రులు టీచర్‌ను ప్రశ్నించిన సమయంలో కూడా తమతో దురుసుగా మాట్లాడి, బెదిరించే విధంగా వ్యవహ రించారని వారు ఆరోపిస్తున్నారు. “పిల్లలను ఎందుకు కొట్టారు? ఇలాంటి ప్రవర్తన ఎందుకు చేస్తున్నారు?” అని తల్లిదండ్రులు ప్రశ్నించగా, తమను బెదిరించేలా మాట్లాడారని వారు చెబుతున్నారు. ఈ వ్యవహారంపై గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పిల్లల భద్రతకు సంబంధించిన అంశం కావడంతో పాఠశాల యాజమాన్యం ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి, నిజానిజాలు వెలుగులోకి తీసుకురావాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థులపై ఎలాంటి వేధింపులు లేదా దురుసు ప్రవర్తన చోటుచేసుకోకుండా పాఠశాల బస్సుల్లో తగిన పర్యవేక్షణ చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై పాఠశాల ప్రిన్సిపాల్, యాజమాన్యం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



# పీపల్ పహాడ్ గ్రామంలో గౌడ గీత కార్మిక సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవం

**చౌటుప్పల్ అక్టోబర్ 6(జనంసాక్షి)**
చౌటుప్పల్ మండల పరిధిలోని పీపల్ పహాడ్ గ్రామంలో గౌడ గీత కార్మిక సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలోని గౌడ సంఘం పెద్దలు, యువకులు మరియు సభ్యుల సమక్షంలో ఈ ఎన్నిక ప్రశాంత వాతావరణంలో జరిగింది. సంఘం బలోపేతానికి, గీత కార్మికుల సంక్షేమానికి అందరూ సమ్మతించి నూతన కమిటీని ఎన్నుకున్నట్లు పెద్దలు తెలిపారు.గౌడ గీత కార్మిక సంఘం నూతన కార్యవర్గ అధ్యక్షుడు నల్లంకి మల్లేష్ గౌడ్

**ఉపాధ్యక్షులు:**
- మాదగోని మల్లేష్ గౌడ్ - నల్లంకి ఎట్టయ్య గౌడ్
- బకనగారి మల్లేష్ గౌడ్ - ప్రధాన కార్యదర్శి: బకనగారి అశోక్ గౌడ్
- కోశాధికారి: దోసపాటి అశోక్ గౌడ్

**కార్యదర్శులు:**
- నల్లెంకి రాజు గౌడ్ - రోషణగారి ప్రభాకర్ గౌడ్
- మాదగోని బాలకృష్ణ గౌడ్

**సహాయ కార్యదర్శులు:**
- చిదుగుల్ల యాదయ్య గౌడ్ - నల్లెంకి శంకర్ గౌడ్

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మరియు సభ్యులు మాట్లాడుతూ... తమపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు గ్రామ గౌడ సంఘం పెద్దలకు, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. గౌడ కులబాంధవుల ఐక్యతకు, గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ గౌడ సంఘం పెద్దలు, సభ్యులు మరియు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓటర్ లిస్టు సవరణ పై బిఎల్ఓ లకు అవగాహన

## తహసిల్దార్ శ్రీనివాసరావు

**నూతనకల్ అక్టోబర్ 6 ( జనంసాక్షి)**
ఓటర్ లిస్ట్ సవరణ పై బిఎల్వోలకు తహసిల్దార్ కార్యాలయంలో అవగాహన కల్పించారు.



మంగళవారం తహసిల్దార్ పి శ్రీనివాసరావు, బిఎల్ఓ లు అంగన్వాడి టీచర్లు సూపర్వైజర్లకు నో మ్యాపింగ్,ఓటర్ లిస్టులో లాజికల్ వ్యత్యాసములు ఉన్న ఓటర్ల వివరాలను సరి చేసి డాక్యుమెంట్ల సేకరణ, క్లెయిమ్స్, అభ్యంతరాలను తెలియజేయాలని, పట్టభద్రుల ఎన్నికల దరఖాస్తులను ఫారం 18 ద్వారా స్వీకరించడం వంటి విషయములపై అవగాహన కల్పించారు.బిఎల్ఓ లకు సూపర్వైజర్లకు సమావేశం నిర్వహించి నిర్దే శించిన సమయంలో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని వారు కోరారు.

# అంగన్వాడీ టీచర్స్ హెలర్స్ కు దసరా సెలవులు ఇవ్వాలి

**సూర్యాపేట (జనంసాక్షి):**
అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ కు దసరా సెలవులు 14 రోజులు ఇవ్వాలని అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వెంపటి గురూజీ ప్రభుత్వంను డిమాండ్ చేశారు.మంగళవారం డీడబ్ల్యూఓ కార్యాలయ సూపరింటెండెంట్ హుస్సేన్ కు మెమోరాండం అందజేశారు.అనంతరం వెంపటి గురూజీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే అతి పెద్ద పండుగ బతుకమ్మ, దసరాను ప్రజలంతా జరుపుకుంటారని అన్నారు.అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ కు 14 రోజులు సెలవులు ఇచ్చి టీహెచ్ఆర్ అవకాశం ఇవ్వాలని అన్నారు.గత సంవత్సరం మాదిరి కాకుండా 14రోజులు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.బతుకమ్మ పండుగను పట్టణాలు, గ్రామాల్లో జరుపుకుంటారని బతుకమ్మ పండుగను దృష్టిలో ఉంచుకొని తమకు సెలవులు ఇవ్వాలని యూనియన్ జిల్లా అధ్యక్షురాలు తాటిపాముల నాగలక్ష్మి, యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తంతెనపల్లి సుజాత ప్రభుత్వంకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు సోమగాని రమణ, కలకోట జ్యోతి, కారింగుల సావిత్రి, పద్మ, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

# సెంట్రలైజ్డ్ కిచెన్ విధానం పెద్ద బిల్డప్

## మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్



**మునగాల, అక్టోబర్ 6 (జనంసాక్షి):** మండలంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చేస్తున్న హంగులు, ఆర్భాటాలు చూస్తుంటే ముచ్చటేస్తోందని, దేశంలోనే అతిపెద్ద సెంట్రలైజ్డ్ కిచెన్ తెస్తున్నామని, ఈరోజే ఏదో పిల్లలందరి కడుపులు నింపేస్తున్నామని పెద్ద పెద్ద మాటలు చెప్పి బిల్డప్ లు ఇస్తున్నారని కోదాడ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న గురుకుల పాఠశాలల పరిస్థితి ఏంటని, కనీసం పేద పిల్లలకు రోజుకు మూడు పూటలా నాణ్యమైన, సురక్షితమైన అన్నం పెట్టలేని నీచమైన పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేసారు. కేసీఆర్ బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని తొలగించి, సెంట్రలైజ్డ్ కిచెన్ అని రంగుల హంగులతో రాజకీయ పర్యటనలు చేస్తూ, పబ్లిసిటీలు చేసుకోవడానికి సిగ్గు అనిపించడం లేదా అని ప్రశ్నించారు. కేవలం ఐదు రూపాయలకే అన్నపూర్ణ పథకం ద్వారా లక్షలాది మంది పేదల కడుపు నింపిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని, అతిపెద్ద సెంట్రలైజ్డ్ కిచెన్ విధానం అని బిల్డప్ లు ఇస్తున్నారని హాస్యించారు. గతంలో కూడా ఇదే హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ భాగస్వామ్యంతో, తాను శాసనసభ్యుడిగా ఉన్నప్పుడు కోదాడ నియోజకవర్గంలో పేదలకు, బాటసారులకు కడుపునిండా అన్నం పెట్టాము అన్నారు. నాటి కాంగ్రెస్ సీనియర్ నాయకులు జానారెడ్డి కూడా అసెంబ్లీ సాక్షిగా అన్నపూర్ణ పథకాన్ని అభినందించిన విషయాన్ని ఈరోజు కాంగ్రెస్ నాయకత్వం మర్చిపోయిందా అని ప్రశ్నించారు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో రైతాంగం పరిస్థితి ప్రక్కన బెట్టి, ఎల్ నినో ప్రభావంతో వర్షాలు లేక రైతన్నలు తీవ్ర దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని, వ్యవసాయానికి సాగునీరు లేదని, అప్రకటిత కరెంట్ కోతలతో పంటలు కళ్లముందే ఎండిపోతున్నాయని గుర్తుచేశారు. రాష్ట్రంలో కరువు వచ్చే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తుంటే.. కాంగ్రెస్ నాయకులు మాత్రం హంగులు ఆర్భాటాలు చేస్తూ ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని దుయ్యబట్టారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు తిరగబడి కాంగ్రెస్‌ను తరిమికొట్టడం ఖాయం అని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ కందిబండ సత్యనారాయణ, గ్రామ శాఖ అధ్యక్షుడు ఉడుం కృష్ణ, ఎల్.పి. రామయ్య, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# అక్షరాలు దిద్దించే బడి పైనే అక్షరదోషం!

## మండల పరిషత్ పాఠశాల బోర్డుపై కొరవడిన 'క' అక్షరం

## పట్టించుకోని ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు




**మాడుగులపల్లి సెప్టెంబర్ 6 (జనం సాక్షి ):** భావి భారత పౌరులను తీర్చిదిద్దే బడి ముఖద్వారం పైనే తీవ్రమైన అక్షరదోషం దర్శనమిస్తోంది నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండల పరిధిలోని తోపుచర్ల గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నేమ్‌బోర్డుపై పాఠశాల అనే పదంలో 'క' అక్షరం లేకపోవడం స్థానికులను, గ్రామస్థులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది విద్యాబుద్ధులు నేర్పించి చిన్నారులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బడిలోనే ఇలాంటి అక్షరదోషాలు ఉండటం విమర్శలకు తావిస్తోంది రోజూ పాఠశాలకు వచ్చే ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు ఈ పొరపాటును గమనించకపోవడం వారి అలసత్వానికి అద్దం పడుతోందని గ్రామస్థులు మండిపడుతున్నారు అక్షర క్రమం నేర్పించే స్థానంలోనే తప్పుల తడకగా ఉన్న బోర్డును చూసి పిల్లలు ఏం నేర్చుకుంటారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు ఇప్పటికైనా సంబంధిత విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి, ఆ బోర్డును తొలగించి సరైన అక్షరాలతో కూడిన నూతన బోర్డును ఏర్పాటు చేయాలని తోపుచర్ల గ్రామస్థులు, ప్రజా సంఘాల నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే వరకు పోరాటం

## ❑ టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి



**హుజూర్‌నగర్, అక్టోబర్ 6 (జనంసాక్షి):** ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే వరకు టీఎన్‌టీయూసీ పోరాటం కొనసాగిస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి అన్నారు. టైరు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. మంగళవారం హుజూర్‌నగర్‌లో మిర్యాలగూడ, కోదాడ డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సుల్లో కరపత్రాలు పంపిణీ చేస్తూ కార్మికులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో జరగనున్న గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో టీఎన్‌టీయూసీ అనుబంధ కార్మిక పరిషత్ పోటీ చేస్తోందని, 12 డిమాండ్లతో బరిలో ఉందని తెలిపారు. కండక్టర్లు, డ్రైవర్లు, ఇతర సిబ్బందికి ఉద్యోగ భద్రత, మహిళా ఉద్యోగులకు 8 నెలల ప్రసూతి సెలవులు, అద్దె బస్సుల విధానం రద్దు, ప్రైవేట్ బస్సుల అక్రమ రవాణా అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, చందు, నాగరాజు, రాము, నాగమణి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.




# అంగన్వాడీ టీచర్లు ఆశా వర్కర్లకు ఘన సన్మానం

## బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో 'అంగన్ మిలన్ సేవ'

**మోటకొండూరు, అక్టోబర్ 6 (జనంసాక్షి ):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా సేవలో మైలురాళ్లను పురస్కరించుకుని చేపట్టిన 'సేవా సంకల్ప అభియాన్'లో భాగంగా మండలంలో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో 'అంగన్ మిలన్ సేవ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మోటకొండూరు మండలములోని చాడ, ముత్తిరెడ్డిగూడెం తో పాటు మండలంలో పలు అంగన్వాడి కేంద్రాల్లో సమాజ ఆరోగ్య పరిరక్షణ, చిన్నారుల ఎదుగుదలకు అంకితభావంతో సేవలందిస్తున్న అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఆయాలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. నిరంతరం శ్రమిస్తున్న వారి సేవలను ఈ సందర్భంగా నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి తోటకూరి మహాలక్ష్మి, జిల్లా కార్యవర్గ సభ్యుడు జోరుక ఎల్లేష్, మండల ప్రధాన కార్యదర్శి మల్ల అశోక్, నాయకులు గుర్రాల కోటేష్, పైళ్ల వెంకటరెడ్డి, గుర్రాల కుమార్, భువనగిరి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులను ఖండించండి

## - మేదరమెట్ల వెంకటేశ్వరరావు



**మునగాల, అక్టోబర్ 6 (జనంసాక్షి):** మునగాల మండలంలో ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి కోమటిరెడ్డి వెంకటరెడ్డిల పర్యటన సందర్భంగా ముందస్తుగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు, ములకలపల్లి రాములును ముందస్తుగా అరెస్టు చేయటానికి తీవ్రంగా ఖండిస్తున్నామని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజాసమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న మార్క్సిస్టు పార్టీ నాయకులను అరెస్ట్ చేయడం చాలా దారుణమని, అరెస్టులు, లాఠీలు తూటాలు, ఇవన్నీ మార్క్సిస్టు పార్టీ నాయకులకు కొత్త ఏం కాదని, ప్రజా సమస్యలే తమ ధ్యేయంగా పనిచేసే సమయంలో ఇలాంటివి అనేక పుట్టుకొస్తాయని వారన్నారు. అరెస్టు చేసిన విషయం తెలుసుకొని సూర్యాపేట పోలీస్ స్టేషన్ కు వెళ్లి రాములును పరామర్శించడం జరిగిందని, వీరుతోపాటు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దేవవరం వెంకట్ రెడ్డి, కౌల్దారు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు షేక్ సైదా, పార్టీ ప్రజా సంఘాల నాయకులు తదితరులు ఈ అరెస్టును ఖండిస్తున్నారని వారన్నారు.

# 'సేవా జ్యోతి' బైక్ ర్యాలీని విజయవంతం చేయాలి

## బీజేవైఎం సన్నాహక సమావేశంలో మండల ఇన్‌చార్జి మచ్చ వివాకర్

**మోటకొండూరు, అక్టోబర్ 6 (జనంసాక్షి):** ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా సేవలో 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 'సేవా సంకల్ప అభియాన్'లో భాగంగా అక్టోబర్ 7న నిర్వహించే 'సేవా జ్యోతి' బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని బీజేపీ మండల ఇన్‌చార్జి మచ్చ వివాకర్ కోరారు. భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివాకర్ మాట్లాడుతూ.. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న మోదీ స్ఫూర్తితో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని బుధవారం జరిగే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిర్ర రవీందర్, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు పాండురంగారెడ్డి, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మల్ల అశోక్, వార్డు సభ్యులు రేగు మల్లేష్, ఆలేటి నాగరాజు, సీనియర్ నాయకులు బాల నరసింహులు, శనిగరం ప్రదీప్, భూమండ్ల మురళి తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

## దత్తాయిపల్లి మార్నింగ్ వాక్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్

**తుర్కపల్లి, అక్టోబర్ 6( జనంసాక్షి)**
తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు .ఈ సందర్భంగా గ్రామంలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలతో నేరుగా మాట్లాడి గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై క్షేత్రస్థాయిలో వివరాలను అడిగి తెలుసుకున్నారు. మార్నింగ్ సందర్భంగా గ్రామ ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందుతున్నాయా లేదా అనే అంశంపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతి, మౌలిక వసతుల పరిస్థితి, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు తదితర అంశాలను పరిశీలించారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణము లబ్ధిదారుల పరిస్థితి ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయో తెలుసుకొని సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ప్రతినిధులు కేవలం కార్యాలయాలకు పరిమితం కాకుండా గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని



అన్నారు. ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకుంటూ అభివృద్ధి పనులను పరిశీలిస్తూ దత్తాయ పల్లి గ్రామంలో ప్రభుత్వ విప్ క్షేత్రస్థాయిలో పర్యటన కొనసాగించారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చాడ భాస్కర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్, తాసిల్దార్ రవికుమార్, ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, ఎంపీఓ వెంకటేశ్వర్లు, ఏవో శ్రీ ఉమా, ఎంఈఓ మంజుషా రాణి, విద్యుత్ శాఖ ఏఈ బిక్షపతి, హౌసింగ్ ఏఈ నరేష్, కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు తుమ్మల మమత తిరుపతిరెడ్డి, ఉప సర్పంచ్ జిట్ట బాలకృష్ణ, జిల్లా కాంగ్రెస్ నాయకులు దేవరుప్పల ఐలయ్య, ఎరుకల వెంకటేష్ గౌడ్, దేవరుప్పుల మల్లేష్, గొప్ప లింగారెడ్డి ,నల్లరాజు, గుంటి రాజు, దానబోయిన నవీన్ ,వార్డు సభ్యులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



# రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీలకు నల్లబోతు కార్తీక్ ఎంపిక

**తిరుమలగిరి(సాగర్), సెప్టెంబర్ 6 (జనంసాక్షి):**



తెలంగాణ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఖో–ఖో రాష్ట్ర చాంపియన్‌షిప్ పోటీలకు తిరుమలగిరి సాగర్ మండలానికి చెందిన నల్లబోతు కార్తీక్ ఎంపికయ్యాడు. నల్లగొండ ఖో–ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 4న నల్లగొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో కార్తీక్ అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.తిరుమలగిరి సాగర్ మండల కేంద్రానికి చెందిన నల్లబోతు వెంకటేశ్వర్లు?అంజలి దంపతుల కుమారుడైన కార్తీక్ ప్రస్తుతం నాగార్జునసాగర్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఆరో తరగతి నుంచి గురుకులంలో విద్యాభ్యాసం కొనసాగిస్తూనే ఖో–ఖో క్రీడపై ఆసక్తి పెంచుకున్నాడు.వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్ ప్రోత్సాహంతో ఎస్‌జీఎఫ్‌ఐ, ఖో–ఖో అసోసియేషన్, సీఎం కప్ తదితర పోటీల్లో పాల్గొని జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించాడు. తాజాగా జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు.ఈ నెల 15, 16, 17 తేదీల్లో హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న 45వ తెలంగాణ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ రాష్ట్ర చాంపియన్‌షిప్ పోటీల్లో నల్లగొండ జిల్లా జట్టు తరఫున కార్తీక్ పాల్గొననున్నట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు.మెరుగైన శిక్షణ పొంది క్రీడలో మరిన్ని మెలకువలు నేర్చుకుని, కఠోర శ్రమతో జాతీయస్థాయిలో రాణించడమే తన లక్ష్యమని కార్తీక్ తెలిపారు.రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన కార్తీక్‌ను పాఠశాల ప్రిన్సిపల్ రవికుమార్, పీడీలు జ్యోతి, అరుణ, ఉపాధ్యాయులు అభినందించి, రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

# సమతుల్య ఆహారం అందించడం ద్వారానే పిల్లలలో ఎదుగుదల సాధ్యం

## మార్కెట్ కమిటీ చైర్మన్, తీగల గిరిధర్ రెడ్డి

**తుంగతుర్తి అక్టోబర్ 6 (జనం సాక్షి)**
సమతుల్య ఆహారం అందించడం ద్వారానే పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదల, శారీరక మానసిక అభివృద్ధి సాధ్యమవుతుందని తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి అన్నారు, మంగళవారం మండల కేంద్రంలోని పద్మశాలి భవన్ లో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఘనంగా పోషణ్ మహోత్సవం, అంగన్వాడీ ఉత్సవం కార్యక్రమంలో పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు, పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదల శారీరక అభివృద్ధి అంగన్వాడి కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని తల్లులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు, చిన్నారు లకు అవసరమైన పోషకాహారం ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పాటించాలన్నారు, ఇలాంటి పోషకాహారం అందించడం వల్లనే ఆరోగ్యకరమైన దృఢమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని దీంతో అంగన్వాడీ కార్యకర్తలు తమ సేవలను అందించాలన్నారు, గర్భిణీలు, బాలింతలు, మరియు పిల్లలలో పోషకాహార లోపాన్ని నివారించడం గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నపిల్లల లో ఎదుగుదల తదితర వాటి ప్రాముఖ్యతపై అందరికీ అవగాహన కలిగి ఉండాలన్నారు, ప్రతిరోజు భోజనంలో ఆకుకూరలు, పప్పు ధాన్యాలు, పాలు, గుడ్లు వంటి పోషకాలు ఉండేలా చూసుకోవాలని మహిళలను కోరారు, అంగన్వాడి కేంద్రాల ద్వారా పంపిణీ చేసే పోషకాహారం, విటమిన్, బాలామృతం, వైద్యాధికారుల సలహాలు గర్భిణీలు బాలింతలు పూర్తిస్థాయిలో సద్వినియోగం



చేసుకోవాలని కోరారు, అనంతరం గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం చేయడంతో పాటు పిల్లలకు అక్షరాభ్యాసం, పిల్లలకు అన్నప్రాసన చేశారు, ఈ సందర్భంగా సిడిపిఓ శ్రీదేవి మాట్లాడుతూ బేటీ బచావో బేటిపడవో, సఖి, మన అంగన్వాడి మన బాధ్యత, పోషణ్ అభియాన్, పోషణ్ మాసం తదితర విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో తాసిల్దార్ దయానందం, ఎంపీడీవో చలపతి, సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, గ్రామ సర్పంచ్ మల్లెపాక సాయిబాబా, తోపాటు అంగన్వాడీ సూపర్వైజర్స్, టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు,





## కోమటిపల్లి లో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

**జాజిరెడ్డిగూడెం మండల (జనంసాక్షి):**
జాజిరెడ్డిగూడెం మండలంలోని కోమటిపల్లి గ్రామంలో మంగళవారం సూర్యాపేటజిల్లాకు చెందిన ఏఆర్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా ఉచితకంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వందమందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు,అద్దాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ నున్నయాదగిరి, ఉపసర్పంచ్ మాంద్ర గోవర్ధన్, డాక్టర్ నజీర్, సిబ్బందిపాల్గొన్నారు.

# వికసించిన బ్రహ్మపుష్పం

**మేళ్లచెరువు జనంసాక్షి**



మేళ్లచెరువు మండలంలోని రామా పురం గ్రామానికి చెందిన రంగిశెట్టి సైదయ్య ఇంటి ఆవరణలో అరుదైన బ్రహ్మపుష్పం వికసించడం స్థానికంగా ఆసక్తికరంగా మారింది. సాధారణంగా సంవత్సరానికి ఒక్కసారి మాత్రమే వికసిస్తుందని భావించే ఈ పుష్పం తెల్లని వర్ణంలో అందంగా విచ్చు కోవడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. రాత్రివేళ వికసించిన బ్రహ్మపుష్పం తన ప్రత్యేక ఆకారం, సువాసనతో ఆకట్టుకుంది. పుష్పం వికసించిన విషయం తెలుసుకున్న స్థానికులు సైదయ్య ఇంటికి చేరుకుని పుష్పాన్ని ఆసక్తిగా తిలకించారు. తమ ఇంట్లో అరుదైన బ్రహ్మపుష్పం వికసించడం ఎంతో ఆనందంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా పుష్పానికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు.

# కవితా సాహితీ సందడికి భద్రాచలం వేదిక

## 10న 'శ్రీశ్రీ మార్గం' కవితా సంకలనం, దశాబ్ది సాహిత్య ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

**భద్రాచలం అక్టోబరు 06 (జనంసాక్షి)**

తెలుగు సాహితీ రంగంలో ప్రతిష్టాత్మకంగా రూపొందించిన 'శ్రీశ్రీ మార్గం' అంతర్రాష్ట్ర కవితా సంకలనం, తెలంగాణ సాహితి దశాబ్ది సాహిత్య ప్రత్యేక సంచిక ఆవిష్కరణ కార్యక్రమానికి భద్రాచలం వేదిక కానుంది. ఈ నెల 10న స్థానిక శ్రీ కాకతీయ గ్రాండ్ (కమ్మ సత్రం)లో నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని సాహిత్య అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ సాహితి భద్రాచలం శాఖ అధ్యక్షులు తాతోలు దుర్గాచారి కోరారు. మంగళవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాహితి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన కవుల రచనలతో 'శ్రీశ్రీ మార్గం' కవితా సంకలనాన్ని రూపొందించినట్లు చెప్పారు. తెలంగాణలో సాహిత్య రంగంలో విశేష కృషి చేస్తున్న తెలంగాణ సాహితి సంస్థ ప్రస్థానాన్ని ప్రతిబింబించేలా దశాబ్ది సాహిత్య ప్రత్యేక సంచికను కూడా రూపొందించినట్లు దుర్గాచారి తెలిపారు. రెండు పుస్తకాలను రాష్ట్రస్థాయి కవులు, సాహితీవేత్తలు, ప్రముఖుల సమక్షంలో ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఇప్పటికే పలు కమిటీలు పనిచేస్తున్నాయని తెలిపారు. తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఆనందాచారి, కపిల రాంకుమార్, జిల్లా బాధ్యులు మండవ సుబ్బారావు, ఎస్. కాంతారావు, భద్రాచలం మాల్యశ్రీ తదితరులు పాల్గొననున్నట్లు చెప్పారు. అలాగే స్థానిక ప్రముఖులు తాళ్లూరి పంచాక్షరయ్య, పాకాల దుర్గాప్రసాద్, గోళ్ల భూపతిరావు, జి.ఎస్. శంకర్రావు, మాగంటి సాయి సూర్య, తిప్పన సిద్దులు, బూసిరెడ్డి శంకర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు సమత, రోటరీ క్లబ్ అధ్యక్షులు అజీమ్, గ్రీన్ భద్రాద్రి అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, సమాజ సేవకులు జి. మాధవరెడ్డి, ఆర్టీసీ భద్రాచలం డిపో మేనేజర్ పి. జంగయ్య, క్రాంతి విద్యాలయం అధినేత సోమరౌతు శ్రీనివాస్, రజనీటాప్ రాము తదితరులు అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. 'శ్రీశ్రీ మార్గం' కవితా సంకలనంలో భాగస్వాములైన తెలుగు రాష్ట్రాలకు చెందిన 109 మంది కవులు కూడా కార్యక్రమానికి హాజరుకానున్నారని దుర్గాచారి తెలిపారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పుస్తకావిష్కరణ



కార్యక్రమానికి సాహిత్యాభిమానులు, కవులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సన్నాహక సమావేశంలో ప్రముఖ కవి మాల్యశ్రీ, తెలంగాణ సాహితి భద్రాచలం శాఖ గౌరవ సలహాదారులు జి. శంకర్రావు, గోళ్ల భూపతిరావు, మాగంటి సాయి సూర్య, సోంపాక సీత, కె. కనకదుర్గ, ఎం. పద్మావతి, యర్రంశెట్టి పూర్ణిమ, కుంజా నాగలక్ష్మి, చాగర్లమూడి నాగవేణి, కాలం సాయికుమారి, కట్టా వెంకటరమణ, జి. జాన్సన్, ఈగపాటి రంజాన్, బత్తుల వెంకటేశ్వర్లు, జే.ఆర్. మూర్తి తదితరులు పాల్గొన్నారు.



## బిజెపి శ్రేణుల ఆధ్వర్యంలో అంగన్వాడీ సిబ్బందికి సత్కారం

**టేకులపల్లి, అక్టోబర్ 6(జనంసాక్షి):**

సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా టేకులపల్లి మండలంలోని అంగన్వాడీ సిబ్బందికి మంగళవారం స్థానిక బిజెపి శ్రేణులు ఘనంగా సత్కరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని, 25 సంవత్సరాల ప్రజాసేవకు గుర్తుగా భారతీయ జనతా పార్టీ చేపట్టిన"సేవా సంకల్ప్ అభియాన్"లో భాగంగా టేకులపల్లి మండలంలోని అనేక అంగన్వాడీ కేంద్రా లను సందర్శించారు. వాటిలో టేకులపల్లి మండల కేంద్రంలో, ఏ కాలనీ తండాలో, వాగొడ్డు తండాలో, రోళ్లపాడు, భీల్యతండ లతో పాటు 18 అంగన్వాడి కేంద్రాలలో అంగన్వాడి సిబ్బందిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చిన్నారుల భవిష్యత్తు కోసం అహర్నిశలు సేవలందిస్తున్న అంగన్వాడీ టీచర్లు, ఆయమ్మలను శాలువాలతో సత్కరించి, చిన్నారులకు బిస్కెట్లు, చాక్లెట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. చిన్నారుల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తు కోసం సేవలందిస్తున్న ప్రతి అంగన్వాడీ సిబ్బందికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి బోడ పూనియా నాయక్ , జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షులు బానోత్ గంగా , మండల అధ్యక్షుడు శంభు నాయక్, గిరిజన మోర్చా జిల్లా నాయకులు రవి రాథోడ్, సీనియర్ నాయకులు చిక్కా వెంకటేశ్వర్లు, నెల్లూరి సత్యం, బాలకృష్ణ, ధరావత్ ద్రావ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## 19 ఏళ్లకే మంచానికే పరిమితమైన కార్తీక్..!

- రక్తకణాల వ్యాధితో పక్షవాతం..
- కొడుకును కాపాడుకునేందుకు పేద తల్లిదండ్రుల తపన
- వైద్యానికి దాతల సాయం కోసం ఎదురుచూపు

**బూర్గంపహాడ్ అక్టోబర్ 06 (జనంసాక్షి)**



ఆడుతూ పాడుతూ జీవితాన్ని ఆస్వాదించాల్సిన వయసు.. కుటుంబానికి అండగా నిలవాల్సిన తరుణం.. కానీ విధి ఆ యువకుడిని చిన్న వయసులోనే మంచానికే పరిమితం చేసింది. రక్తకణాల వ్యాధి క్రమంగా ముదిరి పక్షవాతానికి దారితీయడంతో 19 ఏళ్ల కొర్సా కార్తీక్ దీనస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. కన్నకొడుకును కాపాడుకోవాలన్న తపనతో తల్లిదండ్రులు దాతల సాయం కోసం దీనంగా ఎదురుచూస్తున్నారు. బూర్గంపహాడ్ మండలం ఇరవెండి గ్రామానికి చెందిన కొర్సా కార్తీక్ గత ఐదేళ్లుగా రక్తకణాల సమస్యతో బాధపడుతున్నాడు. తొలినాళ్లలో రెండేళ్లపాటు మందులు వాడుతూ కొంత ఉపశమనం పొందినప్పటికీ, వ్యాధి క్రమంగా తీవ్రరూపం దాల్చింది. రక్తకణాలు దెబ్బతినడంతో ఆరోగ్యం క్షీణించి, ప్రస్తుతం కాళు చచ్చుబడి పక్షవాతంతో మంచానికే పరిమితమయ్యాడు. కార్తీక్ తల్లిదండ్రులు కొర్సా సర్వేలు, విజయ కూలీపనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. తమకున్న కొద్దిపాటి ఆదాయంతోనే కొడుకుకు వైద్యం చేయిస్తూ ఇప్పటివరకు రూ.2 లక్షలకు పైగా ఖర్చు చేశారు. అయినా కుమారుడి ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో వారి ఆవేదన వర్ణనాతీతంగా మారింది. ప్రస్తుతం కార్తీక్‌ను మెరుగైన వైద్యం కోసం తల్లిదండ్రులు విజయవాడలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యానికి మరింత డబ్బు అవసరం కావడంతో పేద కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. 'మా కొడుకును బతికించుకోవడానికి మీ చేయూత అందించండి' అంటూ దాతలను ఆ తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. కార్తీక్ వైద్యానికి ఆర్థిక సహాయం చేయదలచిన దాతలు 9866022051 నంబర్‌కు ఫోన్‌పే ద్వారా తమ వంతు సాయం అందించాలని కుటుంబసభ్యులు చేతులెత్తి వేడుకుంటున్నారు.

## కోయ భాషను అంతరించిపోకుండా కాపాడుకోవాలి

- పిల్లలకు మాతృభాష, సంస్కృతి విలువలు నేర్పించాలి
- దివ్య దేవరాజన్
- మాతృభాష, సంస్కృతిని పరిరక్షించాలని పిలుపు
- ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీవో బి.రాహుల్

**భద్రాచలం అక్టోబరు 06 (జనంసాక్షి)**



ఆదివాసుల మాతృభాష కోయ భాషను భావితరాలకు అందిస్తూ, అంతరించిపోకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలంగాణ పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖల కమిషనర్ దివ్య దేవరాజన్ అన్నారు. పిల్లలకు విద్యతోపాటు మాతృభాష, సంస్కృతి, సంప్రదాయాల విలువలను తల్లిదండ్రులు నేర్పించాలని సూచించారు. భద్రాచలం గిరిజన భవన్‌లో నిర్వహించిన 12వ గోండి?కోయ నిఘంటువు భాషా ప్రామాణిక వర్క్‌షాప్‌కు ఆమె హాజరయ్యారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు ఐదు రోజులపాటు చర్చించి సుమారు 15 వేల ప్రామాణిక పదాలను సేకరించడం అభినందనీయమన్నారు. కోయ భాషకు లిపి లేకపోయినా నిఘంటువు రూపకల్పనకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ ఆదివాసీ యువత విద్యతోపాటు మాతృభాష, సంస్కృతిని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. ఐటీడీఏ పీవో బి.రాహుల్ మాట్లాడుతూ కోయ భాషపై చిన్నారుల్లో ఆసక్తి పెంచేందుకు పాఠశాలల్లో, ఐటీడీఏ కార్యక్రమాల్లో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐటీడీఏ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, భాషా ప్రతినిధులు పాల్గొన్నారు.

## యూనియన్ బ్యాంకు ఏటీఎంలో దొంగ హల్చల్

**బాధితుడి ఏటీఎం కార్డు మార్చి మరొక కార్డు ఇచ్చిన వైనం**

**రూ.25000 వేలు డ్రా చేసిన నిందితుడు - నిరక్షరాస్యులే దొంగల టార్గెట్**

**హుజూర్ నగర్ రూరల్, అక్టోబర్ 6 (జనంసాక్షి):**



మండల పరిధిలోని శ్రీనివాసపురం గ్రామానికి చెందిన జింకల పద్మ , లింగయ్య దంపతులు మంగళవారం ఉదయం10:45 నిమిషాల సమయంలో పట్టణంలోని యూనియన్ బ్యాంక్ దగ్గరకి డబ్బులు తెచ్చుకోవడానికి వెళ్లిన క్రమంలో, ఏటిఎంలోనే బాధితుడి కార్డు స్థానంలో మరొక ఏటీఎం కార్డు ఇచ్చి అక్కడినుండి నిష్క్రమించాడు. సంఘటన జరిగిన 15 నిమిషాల్లోనే బాధితుడి ఫోన్ కి రూ.25000 వేలు డ్రా చేసినట్లు మెసేజ్ వచ్చింది. దాంతో బాధితుడు లింగయ్య కన్నీరు మున్నీరయ్యారు. భాదితుడు వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన పట్టణ ఎస్ఐ చలికంటి నరేష్ సీసీటీవీ ఫుటేజ్ పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



## కామేపల్లి ఎరువుల షాపులో వ్యవసాయ అధికారులు ఆకస్మిక తనిఖీలు

**ఎరువుల మందుల షాపుల యజమానుల అక్రమాలపై'డిఎఓ' ఉక్కుపాదం!**

**జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ధనసరి పుల్లయ్య**

**పాలు రికార్డుల పరిశీలన**

**కామేపల్లి,అక్టోబర్ 6 (జనంసాక్షి):**

కామేపల్లి మండల కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల్లోని ఎరువులు మందుల దుకాణాలపై జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించినా, ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు ఎరువులు విక్రయించినా సహించేది లేదని, నిబంధనలు అతిక్రమిస్తే షాపుల లైసెన్సులు రద్దు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తీవ్రంగా హెచ్చరించారు.

?రైతులకు ప్రతి పథకం,సాయం సత్వరమే అందాలంటే సాంకేతిక ప్రక్రియలు వేగవంతం కావాలని స్పష్టం చేశారు. ఫార్మర్ రిజిస్ట్రీ నమోదులో ఏమాత్రం అలసత్వం వహించకుండా ప్రక్రియను పరుగులు పెట్టించాలని వ్యవసాయ విస్తరణ అధికారులకు సూచించారు. అలాగే పొలాల్లో సాగవుతున్న పంటల వివరాలను పక్కాగా నమోదు చేసేందుకు డిజిటల్ క్రాప్ బుకింగ్ సర్వేను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సర్వేయర్లను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని తేల్చిచెప్పారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో కామేపల్లి వ్యవసాయ అధికారి తారాదేవితో పాటు మండల వ్యవసాయ శాఖ సిబ్బంది,ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై అశ్వారావుపేట పోలీసుల మెరుపు దాడి

### ఆరుగురు అదుపులో.. రూ.8,100 నగదు, పేకముక్కలు, వాహనాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం

**అశ్వారావుపేట అక్టోబర్ 6(జనంసాక్షి):** అశ్వారావుపేట మండలంలో పేకాట స్థావరంపై పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు.విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో అశ్వారావుపేట పోలీసులు నారం వారి గూడెం కాలనీ గ్రామ శివారులోని చెరువు సమీపంలో ఉన్న ఖాళీ స్థలంపై దాడి చేశారు.అశ్వారావుపేట ఎస్ఐ టీ. యయాతీ రాజు తెలిపిన వివరాల ప్రకారం. నారం వారి గూడెం కాలనీ గ్రామ శివారులోని చెరువు దగ్గర ఖాళీ ప్రదేశంలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది.దీంతో సమాచారం ఆధారంగా పోలీసులు అక్కడికి చేరుకుని ఆకస్మికంగా దాడి నిర్వహించారు.పోలీసుల రాకను గమనించినప్పటికీ అక్కడి నుంచి తప్పించుకునే అవకాశం లేకపోవడంతో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుంచి 52 పేకముక్కలు, రూ.8,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అదేవిధంగా పేకాట స్థావరానికి వచ్చిన వారి వద్ద ఉన్న 4 మోటార్‌సైకిళ్లు, 5 మొబైల్ ఫోన్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.మొత్తం స్వాధీనం చేసుకున్న వస్తువులను పోలీస్ స్టేషన్‌కు తరలించి, ఘటనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.పేకాట,ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా కొనసాగుతుందని పోలీసులు స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పేకాట స్థావరాల నిర్వహణకు పాల్పడుతున్నా, పేకాట ఆడుతున్నా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రజలకు ఎక్కడైనా పేకాట లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. అశ్వారావుపేట మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారని ఎస్ఐ యయాతీ రాజు తెలిపారు.

# నిజాయితీ చాటుకున్న యువకుడు..




**కోదాడ,( జనంసాక్షి):** కోదాడ మండల పరిధిలోని ద్వారకుంట గ్రామానికి చెందిన వనపర్తి ఉపేందర్ అనే యువకుడు తన నిజాయితీని చాటుకున్నాడు. మధ్యాహ్నం సమయంలో కోదాడ నుండి ద్వారకుంటకు వెళ్తుండగా, దుర్గాపురం దాటిన తర్వాత జాతీయ రహదారిపై ఆయనకు అత్యంత ఖరీదైన మొబైల్ ఫోన్ దొరికింది.సదరు ఫోన్‌ను వెంటనే తీసుకున్న ఉపేందర్ కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు అప్పగించారు. ఫోన్ పోగొట్టుకున్న బాధితుడిని గుర్తించి వారికి అందజేయవలసిందిగా కోరారు. యువకుడి నిజాయితీని కోదాడ రూరల్ పోలీసులు, స్థానికులు ప్రత్యేకంగా అభినందించారు..

# ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడి తొలగింపు

### ఎమ్మార్పీఎస్ పేరును దుర్వినియోగం చేస్తే ఉపేక్షించం

### జిల్లా ఇన్‌చార్జి కోళ్ల శివ మాదిగ



**తిరుమలగిరి (సాగర్), అక్టోబర్ 06 (జనంసాక్షి):** ఎమ్మార్పీఎస్ పేరుతో అధికారులు, ప్రజాప్రతినిధులను బెదిరిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటూ ఇరిగి శ్రీను అరెస్టయిన ఘటన నేపథ్యంలో ఆయనపై ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ క్రమశిక్షణ చర్యలు చేపట్టింది. ఇటీవల తిరుమలగిరి (సాగర్ )మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా నియమించబడ్డ ఇరిగి శ్రీనును మండల అధ్యక్ష పదవి నుంచి తొలగిస్తూ జిల్లా కమిటీ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కోళ్ల శివ మాదిగ తెలిపారు.ఎమ్మార్పీఎస్ పేరును ఉపయోగించి అధికారులు, ప్రజాప్రతినిధులను బెదిరించడం, అక్రమ వసూళ్లకు పాల్పడటం వంటి చర్యలకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలు జిల్లా కమిటీ దృష్టికి రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఎమ్మార్పీఎస్ సంస్థ పేరు, బాధ్యతలను వ్యక్తిగత ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేయడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. సంస్థ నియమావళికి విరుద్ధంగా వ్యవహరించే వారు ఎంతటి వారైనా క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.తిరుమలగిరి మండల ఎమ్మార్పీఎస్ నూతన అధ్యక్షుడి నియామకాన్ని త్వరలో చేపడతామని కోళ్ల శివ మాదిగ తెలిపారు.

# హమాలీలపై అలసత్వమొద్దు.. హామీలు నెరవేర్చకుంటే పోరాటమే మార్గం

### సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి నవీన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి తీవ్ర హెచ్చరిక



**కామేపల్లి,అక్టోబర్ 6 (జనంసాక్షి):** కార్పొరేట్ల ఊడిగానికి పెద్దపీట వేస్తూ శ్రమజీవులైన హమాలీ కార్మికులపై అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి ఎస్. నవీన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి తీవ్ర స్థాయిలో ఖండిస్తూ హెచ్చరించారు. మంగళవారం కామేపల్లిలో సీఐటీయూ మండల కన్వీనర్ బదావత్ శ్రీనివాస్ నాయక్ అధ్యక్షతన జరిగిన హమాలీ వర్కర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. హమాలీల సంక్షేమం కోసం ప్రత్యేక వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేసి ప్రతీ కార్మికుడికి అసంఘటిత గుర్తింపు కార్డులతో పాటు సామాజిక భద్రత కల్పించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేస్తూ పట్టు బట్టారు. ఉచిత వైద్యం కోసం హెల్త్ కార్డులు, ప్రమాద మరణ రక్షణ భీమ పరిహారంగా రూ.25 లక్షల బీమా వర్తింపజేయడంతో పాటు 55 ఏళ్లు దాటిన హమాలీలకు నెలకు రూ.6,000 పెన్షన్ మంజూరు చేయాలని స్పష్టం చేశారు.నిరుపేద కార్మికులకు ప్రభుత్వమే భూమి కొనుగోలు చేసి 120 గజాల స్థలంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి'హమాలీ నగర్' ఏర్పాటు చేయాలని,పని ప్రదేశాల్లో తాగునీరు,విశ్రాంతి గదులు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తూనే ఐఎల్ఓ నిబంధనల ప్రకారం 50 కేజీలకు మించిన బస్తాల మోతను తక్షణమే నిషేధించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కూచిపూడి నరేష్, ముత్తయ్య,రాము, గోపయ్య,మహేష్, రాజు,రఘు తదితరులు పాల్గొన్నారు.



# ఖమ్మంను కరువు జిల్లాగా ప్రకటించాలి

### విద్యుత్ కోతలను నివారించాలి: బాగం హేమంతరావు




**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 6 (జనంసాక్షి)** కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరల ప్రకటన విషయంలో దక్షిణ భారతదేశం పట్ల తీవ్ర వివక్ష ప్రకటించిందని ఇక్కడ పండే ప్రధాన పంటలకు సంబంధించి ముఖ్యంగా వరి, పత్తి, మిర్చి పంటలకు మద్దతు ధరను ప్రకటించకపోవడం శోచనీయమని తెలంగాణ రాష్ట్ర -రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు తెలిపారు. ఎల్నినో వల్ల ఏర్పడిన తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటల నష్టాన్ని -అంచనా వేసి కరువు జిల్లాలుగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మంజిల్లా సమితి సమావేశం మంగళవారం స్థానిక గిరిప్రసాద్ భవన్లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన హేమంతరావు మాట్లాడుతూ విద్యుత్ కోతలను నివారించాలని, కరువు జిల్లాలుగా ప్రకటించాలని, పంటల బీమాను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న కలెక్టరేట్ల వద్ద ఆందోళన చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా వరి, పత్తి, మిర్చి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని వరికి -ఎకరాకు రూ. 30వేలు, పత్తి, మిర్చికి రూ. 50వేలు, ఇతర పంటలకు రూ. 20వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలన హేమంతరావు డిమాండ్ చేశారు. విద్యుత్ కోతలు దారుణంగా విధిస్తున్నారని ఒక పక్క సాగునీరు లేక పంటలు ఎండిపోతుంటే మరో పక్క భూగర్భ జలాలు ఉన్న -విద్యుత్ సరఫరా లేక పంటలు ఎండిపోతున్నాయని, నాణ్యమైన విద్యుత్ను 24 గంటల పాటు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. దారుణమైన కోతల కారణంగా రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని హేమంతరావు తెలిపారు. రైతు బీమాను అమలు చేయడం లేదని రైతు -బీమాను నిలిపివేసిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా వందలాది మంది రైతులు వివిధ కారణాలతో చనిపోయారని హేమంతరావు తెలిపారు. తక్షణం -రైతు బీమా, పంటల బీమా పథకాలను అమలు చేయాలని ఆయన కోరారు. ఇప్పటికే పత్తి దిగుబడి ప్రారంభమైనందున సిసిఐ కేంద్రాలను -ఏర్పాటు చేసి క్వింటా రూ.10వేల చొప్పున పత్తిని కొనుగోలు చేయాలని లేని పక్షంలో రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపడతామన్నారు. ప్రభుత్వం తీసుకు వచ్చిన ఎరువుల యాప్ రైతుల పాలిట శాపంగా మారిందని యాప్ను రద్దు చేసి స్వేచ్ఛగా మార్కెట్లో -ఎరువులు లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ ఉత్పత్తులను సకాలంలో కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని -ఆయన డిమాండ్ చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతాంగానికి ప్రభుత్వ తాత్సర్యం శాపంగా మారిందని సరైన సమయంలో సీతారామ ప్రాజెక్టు -పూర్తి చేసి ఉంటే ఈనాడు ఈ పరిస్థితి ఎదురయ్యేది కాదని ఉమ్మడి జిల్లా ప్రజలకు గోదావరి జలాలతో కరువు ఉండేది కాదన్నారు. ఇప్పటికైనా సీతారామ ప్రాజెక్టును పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, రైతు సంఘం నాయకులు మిడికంటి వెంకటరెడ్డి, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, రైతు సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

# నల్లగొండలో అక్టోబర్ 8న జాబ్ మేళా

**నల్లగొండ ప్రతినిధి,అక్టోబర్ 6,(జనం సాక్షి):** జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈనెల 8న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి పి. సాహితి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు బీటీఎస్ రోడ్డులోని ఐటీఐ క్యాంపస్ పక్కన ఉన్న జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.పవర్‌లింక్స్ ఇన్‌ఫ్రాటెక్ ప్రైవేట్ లిమిటెడ్, ఆదిత్య ఆర్గానిక్ ఎకో, క్వెస్‌కార్ప్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర కంపెనీలు ఈ జాబ్ మేళాలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయి. ఎంపికైన అభ్యర్థులు నల్లగొండ, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుంది. నెలకు రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు వేతనం అందనున్నట్లు అధికారులు తెలిపారు.ఎస్సెస్సీ నుంచి ఏదైనా డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్, ఫార్మసీ తదితర విద్యార్హతలు కలిగి, 18 నుంచి 35 సంవత్సరాల వయసు ఉన్న వారు అర్హులు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లతో జాబ్ మేళాకు హాజరు కావాలని సూచించారు.మరిన్ని వివరాలకు 0868-2233362, 7893420435 నంబర్లను సంప్రదించవచ్చు.

### బహుజన రాజ్యాధికార సమరభేరి సభను విజయవంతం చేయండి

### బీఎస్పీ తుంగతుర్తి నియోజకవర్గ కన్వీనర్ చెరుకుపల్లి




**జాజిరెడ్డిగూడెం మండల అక్టోబర్ 6,(జనంసాక్షి):** మాన్యవర్ కాన్సీరామ్ వర్ధంతిని పురస్కరించుకొని ఈనెల 9వ తేదీన హైదరాబాదులో నిర్వహిస్తున్న బహుజన రాజ్యాధికార సమరభేరి సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. మంగళవారం అర్వపల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.... స్వాతంత్రం వచ్చి 79 ఏళ్లు పూర్తి చేసుకుని 80 ఏట అడుగుపెట్టినా, రాజ్యాంగం అమల్లోకి వచ్చి 76 ఏళ్ళు దాటినా ఇంకా ఈ దేశంలో అంటరానితనం, వివక్ష కొనసాగుతూనే ఉందని, 85- 90 శాతం మంది ఉన్నా ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీల శ్రమతో దేశ సంపద పెరుగుతుంటే అగ్రకుల మనువాదులు రాజకీయాధికారాన్ని అనుభవిస్తూ బహుజనులను అణగదొక్కుతున్నారని, తెలంగాణలో ధనానికి అధికారానికి భయపడకుండా వేల ఏళ్లుగా అణిచివేతకు గురవుతున్న బహుజనుల న్యాయమైన హక్కు అయిన బహుజన రాజ్యాధికారాన్ని సాధిద్దామని ఇకపై ఓట్లు మనవే సీట్లు మనవేనని చెప్పారు. ఆయన వెంట బీఎస్పీ నాయకులు దయాకర్, శ్రీనివాసు, వెంకన్న, అంజి ఉన్నారు.



## జాలాల్‌పూర్ కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడిగా పాలకూర్ల రాజు గౌడ్

**భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 6 (జనంసాక్షి):**
భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, గ్రామ శాఖ అధ్యక్షుడు గుండ్ల మహేష్ ఆధ్వర్యంలో జాలాల్‌పూర్ గ్రామ నూతన యూత్ కమిటీని ఎన్నుకున్నారు. యూత్ అధ్యక్షుడిగా పాలకూర్ల రాజు గౌడ్, ఉపాధ్యక్షుడిగా షాపాక బాల నరసింహ, కార్యదర్శిగా గంజి రాజేశ్వర్, కోశాధికారిగా గుండ్ల అరుణ్, ప్రచార కార్యదర్శిగా రేవెల్లి శ్రీకాంత్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోరంటి శ్రీనివాస్ రెడ్డి, పాలకూర్ల ఆగయ్య గౌడ్, దేవాలయ చైర్మన్ కేసారం సురేందర్ రెడ్డి, గుండ్ల శ్రీరాములు, షాపాక బిక్షపతి, షాపాక శంకర్, బీసీ సెల్ అధ్యక్షుడు పాలకూర్ల ఉపేందర్ గౌడ్, రైతు సంఘం అధ్యక్షుడు కేసారం శ్రీకాంత్ రెడ్డి, వార్డు సభ్యులు బైరు శివాజీ గౌడ్, షాపాక బాలమణి, శ్యామ్, కేసారం నరేందర్ రెడ్డి, గడ్డం నవీన్, కంది మహేందర్ రెడ్డి, షాపాక స్వామి, వర్ణ శ్రీకాంత్ రెడ్డి, మహంకాళి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ కమిషన్‌లో మాదిగ జర్నలిస్టులకు ప్రాతినిధ్యం కల్పించాలి

**భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 6 (జనంసాక్షి):**



ఎస్సీ కమిషన్ చైర్మన్, సభ్యుల నియామకాల్లో రొటేషన్ విధానం అమలు చేసి, మాదిగ, అనుబంధ ఉపకులాలకు చెందిన అర్హులైన జర్నలిస్టులకు ప్రాతినిధ్యం కల్పించాలని టీఎంజేఎఫ్ జిల్లా నాయకులు మీసాల సైదులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీ కమిషన్ నూతన నియామకాల్లో జర్నలిజం రంగంలో అనుభవం ఉన్న మాదిగ జర్నలిస్టులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. సామాజిక న్యాయం కేవలం మాటల్లో కాకుండా నియామకాల్లోనూ ప్రతిఫలించాలని అన్నారు. ఈ డిమాండ్‌ను మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లేందుకు వినతిపత్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు.

## సేవా సంకల్పంలో అంగన్‌వాడీ సిబ్బందికి సన్మానం

**వలిగొండ, అక్టోబర్ 6 (జనంసాక్షి )**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప కార్యక్రమంలో భాగంగా వలిగొండ మండలం సంగెం గ్రామంలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, ఆయాలను బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి కందుల తానేష్ గౌడ్ ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా తానేష్ గౌడ్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడంతో పాటు చిన్నారులు, తల్లులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గంగాపురం నరేశ్, రంగాపురం శ్రీను, గంగాపురం భాస్కర్, బండ్యాల మహేష్, మెడగొని వీరేశం , గంగపురం శ్రీను,తదితరులు పాల్గొన్నారు.






## విద్యార్థులే ప్రజాస్వామ్యానికి చోదకశక్తి

### ఓటు హక్కుపై అవగాహన

**భద్రాచలం అక్టోబరు 06 (జనంసాక్షి)**
ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ యువకుడు ఓటరుగా నమోదు చేసుకుని తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని భద్రాచలం తహసీల్దార్ కె. రవికుమార్ సూచించారు. భద్రాచలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ఎన్ఎస్ఎస్, రాజనీతి శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటరు అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ యువత ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషించాలని, ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు, తమ కుటుంబ సభ్యులు, పరిసరాల్లోని వారిని కూడా ఓటరు నమోదుపై చైతన్యపరచాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. జాన్ మిల్టన్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు విలువను విద్యార్థులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండటమే కాకుండా, ఇతరుల్లోనూ చైతన్యం తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్ హిమజ, ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారులు డాక్టర్ కిరణ్ కుమార్, బి. సుధాకర్ రావు, రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు వీరస్వామి, ఇతర అధ్యాపకులు, భద్రాచలం రెవెన్యూ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



## రైతు ప్రజా ప్రయోజనార్థం పొన్నేకల్‌లో మెగా పశువైద్య శిబిరం

### శాస్త్రీయ పద్ధతులపై రైతులకు అవగాహన

**కామేపల్లి,అక్టోబర్ 6 (జనంసాక్షి):**
గ్రామీణ ప్రాంతాల్లోని పాడి రైతులకు పశు ఆరోగ్యం,మెరుగైన పోషణపై అవగాహన కల్పించే అందుకు లక్ష్యంతో మండల పరిధిలోని పొన్నేకల్ గ్రామంలో అక్టోబర్ 6న ఐసీఏఆర్?ఎన్ఎంఆర్ఐ సంయుక్త ఆధ్వర్యంలో మెగా పశువైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. కామేపల్లి మండల పశువైద్యాధికారి డాక్టర్ జి.నాగులు ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో ఆవులు, గేదెలు,మేకలు గొర్రెలకు విస్తృత స్థాయిలో వైద్య సేవలు అందించారు. ప్రధానంగా ఆవులు, గేదెలలో ఉన్న గర్భకోశ వ్యాధులు, దీర్ఘకాలిక సంతానోత్పత్తి సమస్యలకు ప్రత్యేక చికిత్సలు చేయడంతో పాటు దూడలు,గొర్రెలకు నట్టల నివారణ మందులు,టీకాలు వేశారు.పశువుల ఆరోగ్య స్థితిని పరిశీలించిన అనంతరం రైతులకు ఉచితంగా మందులు, పోషకాహార సామగ్రిని పంపిణీ చేశారు. అనంతరం ఐసీఏఆర్ ఎన్ఎంఆర్ఐ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో పాడి పశువుల పెంపకం, వ్యాధుల నివారణ శాస్త్రీయ యాజమాన్య పద్ధతులపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ పురేందర్, తెలంగాణ స్టేట్ వెటర్నరీ డాక్టర్స్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రమేశ్‌బాబు, అధికారి డాక్టర్ కిషోర్,వైరా ఏడీ డాక్టర్ పండారి బాబుతో పాటు పలువురు వైద్యులు, గోపాలమిత్ర సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాడి రైతులు పెద్ద సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.





## రాష్ట్ర స్థాయిలో రెండవ స్థానంలో గెలుపొందిన కబడ్డీ జట్టులో పెనుబల్లి క్రీడాకారిణి

**పెనుబల్లి, అక్టోబర్ 6 (జనంసాక్షి)**
సబ్ జూనియర్ బాలికల కబడ్డీ పోటీల్లో రెండవ స్థానం సాధించిన ఖమ్మం జిల్లా జట్టులో పెనుబల్లి గ్రామానికి చెందిన పరసామల్లి కార్జున కూతురు అహల్య పాల్గొనడం జరిగింది. అక్టోబర్ 2 నుండి 5 వరకు రాజన్న సిరిసిల్ల వేములవాడలో జరిగిన సబ్ జూనియర్ బాలికల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ఖమ్మం జిల్లా జట్టులో పెనుబల్లి మండలం వీఎం బంజర్ హై స్కూల్ విద్యార్థిని అహల్య స్కూల్ తరుపున పాల్గొనడం జరిగిందని,ఎం ఈ ఓ మోహన్ రావు, హై స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ బండి రాము తెలిపారు. ఈ సందర్భంగా అహల్యను అభినందించారు.

## పేదలకు ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వ భూమిని పరిశీలించిన రాష్ట్ర నాయకులు మట్టా దయానంద్



**పెనుబల్లి, అక్టోబర్ 6(జనం సాక్షి )**
రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ మంగళవారం పెనుబల్లి మండలం ముత్తగూడెం గ్రామంలో ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు అందించేందుకు ప్రభుత్వ భూమిని పరిశీలించారు. గ్రామంలోని దాదాపు రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు పట్టాలు ఇచ్చి, ఇళ్లు నిర్మించుకునే విధంగా వినియోగించే అంశంపై ఆయన పరిశీలన చేపట్టారు. అర్హులైన నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా భూమి అందించి, వారి సొంత ఇంటి కలను నెరవేర్చేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో తాసిల్దార్ వీరభద్ర నాయక్, కాంగ్రెస్ నాయకులు కీసర శ్రీనివాస్ రెడ్డి,గూడూరు మాధవరెడ్డి, ముత్తగూడెం గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో సెర్ప్ సిసి మెంతెన నరేష్ మృతి

**టేకులపల్లి, అక్టోబర్ 6(జనంసాక్షి):**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలో సెర్ఫ్ సీసీగా పనిచేస్తున్న మెంతెన నరేష్ అనారోగ్య కారణంగా పాల్వంచ వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందారు. నరేష్ గత 2 సంవత్సరాలుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. టేకులపల్లి మండలంలో సెర్ప్ సీసీ గా గత 11సం, రాలుగా పనిచేస్తున్నారు. మృతుని స్వగ్రామం గుండాల మండలం కాచినపల్లి కావడంతో నరేష్ భౌతిక ఖాయాన్ని వారి స్వగృహానికి తరలించారు. నరేష్ మృతితో సెర్ప్ కార్యాలయం సిబ్బందితో పాటు, మండల ప్రజా పరిషత్ కార్యాలయపు సిబ్బంది విషాదంలో మునిగారు.

## డివిజన్ అసోసియేట్ అధ్యక్షునిగా ప్రమోద్



జాజిరెడ్డిగూడెం మండల **అక్టోబర్ 6 (జనంసాక్షి):** తెలంగాణ పంచాయతిరాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం తుంగతుర్తి డివిజన్ అసోసియేట్ అధ్యక్షునిగా అర్వపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో సబార్డినేట్‌గా పనిచేస్తున్న దాసరి ప్రమోద్ ఎన్నికయ్యారు. దీంతో మంగళవారం స్థానిక కార్యాలయంలో ప్రమోద్‌ను సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు సీహెచ్. ప్రవీణ్, శ్రవంతో పాటు కార్యాలయ సిబ్బంది సన్మానించారు. నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానని ప్రమోద్ పేర్కొన్నారు.

# విద్యార్థుల దాహార్తి తీర్చిన వాసవి క్లబ్

- నోట్‌బుక్స్ పంపిణీ.. పాఠశాలకు మంచినీటి వాటర్ ట్యాంక్ ఏర్పాటు
- సేవా కార్యక్రమాలను ప్రారంభించిన డిస్ట్రిక్ట్ గవర్నర్ చారుగుళ్ల శ్రీనివాస్



**బూర్గంపహాడ్ అక్టోబరు 06 (జనంసాక్షి)** విద్యార్థుల భవిష్యత్తుకు భరోసానిస్తూ.. వారి చదువుకు అవసరమైన విద్యా సామగ్రిని అందిస్తూ.. పాఠశాలలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ వాసవి క్లబ్ సేవా స్ఫూర్తిని చాటుకుంది. వాసవి క్లబ్ సారపాక గ్రేటర్, వనిత సారపాక క్లబ్‌ల ఆధ్వర్యంలో బూర్గంపహాడ్ మండలం సారపాక గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం పలు సేవా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చారుగుళ్ల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాలను ప్రారంభించారు.
పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ అందజేయడంతో పాటు స్వీట్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. అంతేకాకుండా విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మంచినీటి వాటర్ ట్యాంకును చారుగుళ్ల శ్రీనివాస్ ప్రారంభించారు. దీంతో విద్యార్థులకు పాఠశాలలోనే స్వచ్ఛమైన మంచినీరు అందుబాటులోకి వచ్చింది.కార్యక్రమానికి పాఠశాల ప్రాంగణానికి చేరుకున్న చారుగుళ్ల శ్రీనివాస్‌ను వాసవి క్లబ్ ప్రతినిధులు ఘనంగా స్వాగతించారు. అనంతరం విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించిన ఆయన వారి చదువులు, పాఠశాలలోని సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేసి వారిని అభినందించారు. ఈ సందర్భంగా చారుగుళ్ల శ్రీనివాస్ మాటాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు అవసరమైన సహాయాన్ని అందించడం ద్వారా వారి విద్యాభివృద్ధికి తోడ్పడవచ్చన్నారు. గత తొమ్మిది నెలలుగా సారపాక గ్రేటర్, వనిత సారపాక క్లబ్‌లు నిరంతరం సమాజహిత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. నోట్‌బుక్స్ పంపిణీ చేయడం, పాఠశాలలో మంచినీటి సౌకర్యం కల్పించడం వంటి కార్యక్రమాలు విద్యార్థులకు ప్రత్యక్షంగా ఉపయోగపడే సేవలని తెలిపారు. వాసవి క్లబ్‌లు విద్య, వైద్యం, పేదలకు సహాయం, సామాజిక అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన వంటి అనేక రంగాల్లో సేవలను విస్తరించడం అభినందనీయమన్నారు. జిల్లాలోని ఇతర వాసవి క్లబ్‌లు కూడా సారపాక గ్రేటర్, వనిత సారపాక క్లబ్‌లను ఆదర్శంగా తీసుకుని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు తాగునీరు, విద్యా సామగ్రి, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన సేవలు అందించడం ద్వారా సమాజానికి మరింత ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో సేవాభావం, సామాజిక బాధ్యత కూడా పెంపొందుతుందని అన్నారు. పాఠశాలలో మంచినీటి వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు వాసవి క్లబ్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. తాగునీటి సౌకర్యం అందుబాటులోకి రావడంతో విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగించడమే తమ ప్రధాన లక్ష్యమని వాసవి క్లబ్ ప్రతినిధులు తెలిపారు. భవిష్యత్తులోనూ విద్యార్థులు, పేదలు, నిరుపేద కుటుంబాలు, అవసరంలో ఉన్న వారికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా క్యాబినెట్ సెక్రటరీ రేపాక ధనుంజయ రాజ మనోహర్, క్యాబినెట్ ట్రెజరర్ ఉడతా నగేష్ కుమార్, రీజియన్ చైర్మన్ బండారు కృష్ణయ్య, వీకేఎస్పీ ఇంచార్జ్ కేతేపల్లి ప్రవీణ్, క్యాబినెట్ జాయింట్ సెక్రటరీలు చారుగుండ్ల రామకృష్ణ, రేపాక రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. అలాగే సారపాక గ్రేటర్ క్లబ్ అధ్యక్షుడు రేపాక సూర్యప్రకాష్ రావు, కార్యదర్శి బచ్చు సతీష్, కోశాధికారి కంచర్ల గౌతమ్, వనిత సారపాక క్లబ్ అధ్యక్షురాలు కొంజర్ల నిరోషా, కార్యదర్శి పాల్వాయి పావని, వాసవి క్లబ్ సీనియర్ నాయకులు పచ్చిపులుసు సుబ్బారావు, లలిత కుమారి, గుడిమెట్ల సాగర్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థుల అవసరాలను గుర్తించి సేవా కార్యక్రమాలు నిర్వహించడంపై స్థానికులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదలకు వాసవి క్లబ్‌లు చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

## ప్రజా సేవలో అంగన్వాడీ టీచర్లు, ఆయాల పాత్ర కీలకం : దేవకి వాసుదేవ రావు

**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 6 ( జనంసాక్షి )** ప్రజాసేవలో అంగన్వాడీ టీచర్లు , ఆయాల పాత్ర ఎంతో కీలకమని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కోశాధికారి అన్నారు.దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 సంవత్సరాల సుపరిపాలన, ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా సంకల్ప కార్యక్రమాల్లో భాగంగా కూసుమంచి మండలంలోని నేలపట్ల గ్రామంలో మంగళవారం అంగన్ మిలాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కోశాధికారి శ్రీ దేవకి వాసుదేవరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ వారి సేవలను కొనియాడారు.ప్రజలకు నిత్యం సేవలందిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, అంగన్‌వాడీ సిబ్బందిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. మహిళలు, చిన్నారులు, పేద కుటుంబాల ఆరోగ్యం, పోషణ, సంక్షేమం కోసం అంకితభావంతో సేవలందిస్తున్న అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల సేవలను దేవకి వాసుదేవరావు అభినందించారు. గ్రామీణ ప్రాం తాల్లో ఆరోగ్యం, పోషణ, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో వారి పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రజా సేవలో నిరంతరం భాగస్వాములవుతున్న ప్రతి ఒక్కరి సేవలను గుర్తించి గౌరవించడం సమాజ బాధ్యత అని తెలిపారు. సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలోని వివిధ వర్గాలకు అండగా నిలవాలనే లక్ష్యంతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. "సేవే సంకల్పం? ప్రజా సేవే లక్ష్యం" అనే స్ఫూర్తితో సమాజ అభ్యున్నతిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వడ్డంపూడి నరేష్. స్టేట్ కౌన్సిల్ నెంబర్ గడ్డం వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి గుగులోతు మహేందర్ నాయక్, చిన్నబోయిన ఉదయ్ కిరణ్. జర్పుల కోటేష్, వడ్డేంపూడి వినయ్, కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలి



**సూర్యాపేట (జనంసాక్షి):** అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని, ప్రజాస్వామ్యంలో యువతనే కీలక పాత్ర పోషించాలని పిసిసి ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ షఫీ ఉల్లా, డీసీసీ కోశాధికారి కక్కిరేని శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ నాయకులు బైరు వెంకన్న గౌడ్ పిలుపునిచ్చారు.మంగళవారం రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్, మున్సిపల్ చైర్ పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్షాది సూచనల మేరకు సూర్యాపేట పట్టణంలోని 47వ వార్డులో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్ ఆధ్వర్యంలో 46, 47వ వార్డులకు సంబంధించిన గ్రాడ్యుయేట్స్ ఓటర్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు.పట్టణంలోని అన్ని వార్డుల్లో తక్షణమే నమోదు కేంద్రాలని ప్రారంభించాలన్నారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హత ఉన్న ప్రతి గ్రాడ్యుయేట్ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు.ఎన్నికల ప్రక్రియలో పట్టభద్రుల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు బాధ్యతగా వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో 46వ వార్డు ఇంచార్జ్ దంతాల సాయి నవీన్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, జిల్లా కాంగ్రెస్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్, చేనేత సహకార సంఘం డైరెక్టర్ యలగందుల సాయినేత, డీసీసీ మాజీ కార్యదర్శి అక్కేనపల్లి జానయ్య, జిల్లా కాంగ్రెస్ నాయకులు నరేందర్ నాయుడు, ఇజ్రార్ అహ్మద్, గుణగంటి సైదులు గౌడ్, పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బొడ్డు సాయి కృష్ణ, పట్టణ ఎస్సి సెల్ అధ్యక్షుడు పిడమర్తి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## ప్రైవేట్ ఆస్పత్రిలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆకస్మిక తనిఖీ

**ఖమ్మం కార్పొరేషన్ అక్టోబర్ 6 (జనంసాక్షి)** ఖమ్మం పట్టణంలోని అంకుర ఆసుపత్రిని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. రామారావు మంగళవారం ఆకస్మికంగా సందర్శించి క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఈ తనిఖీలలో భాగంగా ఆసుపత్రిలోని రికార్డులు, లేబొరేటరీ (ల్యాబ్), స్కానింగ్ విభాగాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలు, ల్యాబ్ పరీక్షల ప్రమాణాలు, స్కానింగ్ సేవల వివరాలతో పాటు సంబంధిత రిజిస్టర్లను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డా. రామారావు మాట్లాడుతూ ఆసుపత్రిలో నిర్వహించే ప్రతి విభాగం ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా ఉండాలని,అన్ని విభాగాల రికార్డులను ఎప్పటికప్పుడు పక్కాగా నమోదు చేస్తూ, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని. ప్రతి ప్రైవేట్ ఆసుపత్రి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టాన్ని తప్పనిసరిగా పాటించాలని., నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని యాజమాన్యానికి స్పష్టం చేశారు.ఈ తనిఖీ సమయంలో అంకుర ఆసుపత్రి మేనేజర్ రామారావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

- ఐసిడిఎస్, సిడిపిఓ, కృష్ణ శ్రీ



**ఎర్రుపాలెం, అక్టోబర్ 6 (జనంసాక్షి):** పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యం కాపాడుకోవాలని ఐ. సి.డి.ఎస్, మధిర ప్రాజెక్టు సిడిపిఓ కృష్ణ శ్రీ, పేర్కొన్నారు.
ఐసిడిఎస్, ఆధ్వర్యంలో పోషణ మాసం, కార్యక్రమంలో భాగంగా ఎర్రుపాలెం మండల స్థాయిలో పోషణ కార్యక్రమం ఎర్రుపాలెం రైతు వేదిక నందు మంగళవారం నిర్వహించారు.మండలంలోని అంగన్వాడి స్కూల్స్ నుండి తయారుచేసిన పలు రకాలు పౌష్టికాహార పదార్థాలు ఏర్పాటు చేశారు.స్టాల్స్ లో ఉంచిన వివిధ రకాల పౌష్టికాహారాల గురించి ప్రజాప్రతినిధులకు పలువురు ప్రముఖులకు వివరించారు.ఈ కార్యక్రమానికి ఐ సి డి ఎస్ మధిర ప్రాజెక్టు ఏసి.సి.డి.పి.ఓ, కృష్ణ శ్రీ, ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గర్భిణీలు, బాలింతలు,అంగన్వాడి స్కూల్ కి వచ్చే ప్రీస్కూల్ పిల్లలు అంగన్వాడి సెంటర్ లో ఇచ్చే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా సామూహిక శ్రీమంతాలు అక్షరాభ్యాసాలు చేశారు, ఈ కార్యక్రమంలో తాసిల్దార్, సునీత ఎలిజిబెత్, ఎంపీడీవో, ఎంఎస్ఎస్, శారదా దేవి, ఐసిడిఎస్, అధికారులు, సూపర్వైజర్లు, సరిత, లక్ష్మి మధులత, అంగన్వాడి టీచర్లు, సిబ్బంది, గర్భిణీలు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వ భూమిని పరిశీలించిన రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్

**పెనుబల్లి, అక్టోబర్ 6(జనంసాక్షి)** రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ మంగళవారం పెనుబల్లి మండలం ముత్తగూడెం గ్రామంలో ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు అందించేందుకు ప్రభుత్వ భూమిని పరిశీలించారు.గ్రామంలోని దాదాపు రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు పట్టాలు ఇచ్చి, ఇళ్లు నిర్మించుకునే విధంగా వినియోగించే అంశంపై ఆయన పరిశీలన చేపట్టారు. అర్హులైన నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా భూమి అందించి, వారి సొంత ఇంటి కలను నెరవేర్చేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో తాసిల్దార్ వీరభద్ర నాయక్, కాంగ్రెస్ నాయకులు కీసర శ్రీనివాస్ రెడ్డి,గూడూరు మాధవరెడ్డి, ముత్తగూడెం గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పదేళ్ల పోరాటానికి శాశ్వత పరిష్కారం ఎప్పుడు?

## హైదరాబాద్ పబ్లిక్ స్కూల్స్‌లోనే గిరిజన హాస్టళ్లు నిర్మించాలి : డా. భట్టు వెంకన్న





**భద్రాద్రి కొత్తగూడెం అక్టోబర్ 6 (జనంసాక్షి):** హైదరాబాద్ పబ్లిక్ స్కూల్స్‌లో చదువుతున్న గిరిజన బాలబాలికలకు సురక్షితమైన వసతి, నాణ్యమైన విద్య అందించాలన్న లక్ష్యంతో 2016లో ఇందిరా పార్క్ నుంచి ప్రారంభమైన తన పోరాటం దాదాపు పదేళ్లుగా కొనసాగుతోందని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ జాతీయ కోశాధికారి డా. భట్టు వెంకన్న తెలిపారు. హాస్టల్ సమస్యపై రాష్ట్ర ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తులు చేయడంతో పాటు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించామని, న్యూఢిల్లీలోని జాతీయ గిరిజన కమిషన్ దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్లామని ఆయన తెలిపారు. 2024లో హైకోర్టులో చి.ఖ. ఔనీ.16789/2024 ద్వారా న్యాయపోరాటం కొనసాగించామని పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వం ఊా.ఓబ.ఔనీ .53 ద్వారా హాస్టల్ నిర్వహణకు నిధులు కేటాయించినప్పటికీ, క్షేత్రస్థాయిలో ప్రైవేట్ ఏజెన్సీల నిర్వహణ కారణంగా విద్యార్థులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ట్యూషన్ ఉపాధ్యాయులు, కేర్‌టేకర్లు, వాచ్‌మెన్లు, వార్డెన్ల కొరత, రవాణా, భోజనం, విద్యార్థుల భద్రత, దుస్తులు పుస్తకాల పంపిణీ, వైద్య సహాయం వంటి అంశాల్లో సమస్యలు ఉన్నాయని తెలిపారు. సుమారు 240 మంది విద్యార్థులకు వసతి కల్పించే సామర్థ్యం ఉన్నప్పటికీ ప్రస్తుతం సుమారు 50 మంది మాత్రమే హాస్టళ్లలో ఉంటున్నారని చెప్పారు.

**ఏటా రూ.90 లక్షల వ్యయం:**
హాస్టళ్లు పాఠశాలలకు దూరంగా ఉండటంతో అద్దె భవనాలు, రవాణాపై ప్రభుత్వం ఏటా సుమారు రూ.90 లక్షలు ఖర్చు చేస్తోందని డా. భట్టు వెంకన్న తెలిపారు. ఈ వ్యయాన్ని తగ్గించేందుకు బేగంపేట, రామంతపూర్ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రాంగణాల్లో ప్రభుత్వానికి అందుబాటులో ఉన్న భూమిలో 4?5 ఎకరాలు కేటాయించి శాశ్వత హాస్టల్ భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. పాఠశాల ప్రాంగణంలోనే హాస్టల్ ఉంటే విద్యార్థుల భద్రత పెరగడంతో పాటు రవాణా ఖర్చులు తగ్గుతాయని, బాలికలకు మరింత సురక్షితమైన వాతావరణం కల్పించవచ్చని తెలిపారు. తాత్కాలికంగా ప్రైవేట్ ఏజెన్సీలపై ఆధారపడటానికి బదులుగా ప్రభుత్వమే శాశ్వత హాస్టల్ భవనాలు నిర్మించి, వాటిని నిర్వహించాలని కోరారు. హాస్టల్ సమస్యపై ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ద్వారా ముఖ్యమంత్రికి లేఖ నంబర్ 252/ఉచి/యా/2026 ద్వారా విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. "2016లో ఇందిరా పార్క్ నుంచి ప్రారంభమైన పోరాటం హైకోర్టు, జాతీయ గిరిజన కమిషన్ వరకు కొనసాగింది. ఇది వ్యక్తిగత ప్రయోజనం కోసం కాదు.. గిరిజన బిడ్డల భవిష్యత్తు కోసం. ప్రభుత్వం తక్షణమే స్పందించి హైదరాబాద్ పబ్లిక్ స్కూల్స్‌లోనే శాశ్వత హాస్టళ్లు నిర్మించాలి. లేనిపక్షంలో గిరిజన విద్యార్థుల కోసం మరోసారి ప్రజా ఉద్యమాన్ని చేపడతాం" అని డా. భట్టు వెంకన్న స్పష్టం చేశారు.

## సన్న ధాన్యం రకాల గుర్తింపు, ధృవీకరణకు ప్రత్యేక చర్యలు

### జిల్లా వ్యవసాయ అధికారి

**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 6 (జనంసాక్షి)**
వానాకాలం 2026-27 ధాన్యం కొనుగోలు సీజన్ అక్టోబర్ 2026 నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం ఏడు గుర్తింపు పొందిన సన్న ధాన్యం రకాలను ప్రోత్సహిస్తూ, ఆయా రకాలను సాగు చేసిన రైతులకు క్వింటాలుకు రూ. 500 బోనస్ అందించనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి ధనసరి పుల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన బోనస్ సక్రమంగా అందేలా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద గుర్తింపు పొందిన సన్న ధాన్యం రకాల గుర్తింపు, ధృవీకరణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. కొనుగోలు సమయంలో ధాన్యం రకాన్ని సక్రమంగా గుర్తించి, అర్హులైన రైతులకు మాత్రమే బోనస్ ప్రయోజనం అందేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ మేరకు జిల్లాలోని ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం రకాలను గుర్తించడంలో నైపుణ్యం కలిగిన కనీసం ఒక సిబ్బందిని నియమించేందుకు చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ ఆదేశించిందని, నియమితులయ్యే సిబ్బందికి వ్యవసాయంలో బి.ఎస్సీ లేదా డిప్లొమా విద్యార్హతతో ఉండేలా చూడనున్నామన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా ఈ విధుల్లో పాల్గొనే అర్హత కలిగిన సిబ్బందికి ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం పారితోషికం అందిస్తామన్నారు. అర్హత కలిగిన వ్యక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని సంబంధిత మండల వ్యవసాయ అధికారి లేదా వ్యవసాయ విస్తరణ అధికారి లను సంప్రదించవచ్చన్నారు. నియమిత సిబ్బంది ధాన్యం కొనుగోలు సంస్థలకు సహకరిస్తూ, ప్రభుత్వం గుర్తించిన సన్న ధాన్యం రకాల గుర్తింపు, ధృవీకరణ ప్రక్రియలో భాగస్వాములవుతారని జిల్లా వ్యవసాయ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఖమ్మం వన్‌టౌన్, రఘునాథపాలెం ఎస్‌హెచ్‌ఓలుగా బాధ్యతలు స్వీకరించిన ఇన్‌స్పెక్టర్లు



**ఖమ్మం టౌన్, అక్టోబర్ 6 (జనంసాక్షి):**
ఖమ్మం వన్‌టౌన్, రఘునాథపాలెం పోలీస్‌స్టేషన్ల స్టేషన్ హౌస్ ఆఫీసర్లుగా (ఎస్‌హెచ్‌ఓ) ఇన్‌స్పెక్టర్లు ఎం.డి. సాదిక్ పాషా, టి. కరుణాకర్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

## మధిర పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత ఆకస్మిక పర్యటన

**మధిర, అక్టోబర్ 6 (జనంసాక్షి)**





మధిర మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత మంగళవారం విస్తృతంగా పర్యటించారు. వార్డులో నెలకొన్న స్థానిక సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ఆమె ఈ పర్యటన చేపట్టారు. చైర్‌పర్సన్ వెంట మున్సిపల్ కమిషనర్ కె.శామ్యూల్ పాల్,మున్సిపాలిటీకి చెందిన వివిధ శాఖల అధికారులు ఉన్నారు. పర్యటనలో భాగంగా వార్డులో నెలకొన్న డ్రైనేజీ సమస్య, మంచినీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ తదితర అంశాలపై ఆ వార్డు కౌన్సిలర్ దారా నాగార్జునను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మార్కెట్ ఏరియాలో నల్లాల ద్వారా తాగునీరు రావడం లేదని గుర్తించి, వెంటనే స్పందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే, దెబ్బతిన్న డ్రైనేజీలలో పూడికతీత పనులను తక్షణమే చేపట్టాలని, దోమల బెడద నివారణకు వీధుల్లో క్రమం తప్పకుండా ఫాగింగ్ మరియు దోమల మందు పిచికారీ చేయాలని స్పష్టం చేశారు. తాగునీటి సరఫరాకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆటంకం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్య వైఖరిని సహించేది లేదని హెచ్చరించారు. ఎక్కడెక్కడ లైట్లు వెలగడం లేదో గుర్తించి, వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. మున్సిపాలిటీలో ఏ సమస్య అయినా యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి నిర్దేశిత గడువులోగా సమస్యను పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ పర్యాటనలో మున్సిపల్ వివిధ శాఖల అధికారులు, డివిజన్ అధ్యక్షులు రామకృష్ణ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి సిడిపిఓ కృష్ణ శ్రీ

**ఎర్రుపాలెం, అక్టోబర్ 6 (జనంసాక్షి):**
పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యం కాపాడుకోవాలని ఐ. సి.డి.ఎస్, మధిర ప్రాజెక్టు సిడిపిఓ కృష్ణ శ్రీ, పేర్కొన్నారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఎర్రుపాలెం మండల స్థాయిలో పోషణ కార్యక్రమం ఎర్రుపాలెం రైతు వేదిక నందు మంగళవారం నిర్వహించారు. మండలంలోని అంగన్వాడి స్కూల్స్ నుండి తయారుచేసిన పలు రకాలు పౌష్టికాహార పదార్థాలు ఏర్పాటు చేశారు. స్టాల్స్ లో ఉంచిన వివిధ రకాల పౌష్టికాహారాల పై ప్రజాప్రతినిధులకు పలువురు ప్రముఖులకు వివరించారు. ఈ కార్యక్రమానికి ఐ సి డి ఎస్ మధిర ప్రాజెక్టు ఐ సి డి పి ఓ కృష్ణ శ్రీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గర్భిణీలు బాలింతలు అంగన్వాడి స్కూల్ కి వచ్చే ప్రీస్కూల్ పిల్లలు అంగన్వాడి సెంటర్ లో ఇచ్చే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్, సునీత ఎలిజిబెత్, ఎంపీడీవో, ఎంఎస్ఎస్, శారదా దేవి, ఐసిడిఎస్, అధికారులు, సూపర్వైజర్లు, సరిత, లక్ష్మి మధులత, అంగన్వాడి టీచర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కుట్టు మిషన్ శిక్షణతో మహిళలకు స్వయం ఉపాధికి బాట

**చంద్రుగొండ, అక్టోబర్ 6 (జనంసాక్షి):**
చంద్రుగొండ మండలం బెండాలపాడు గ్రామానికి చెందిన మహిళలు ది మదర్ ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కుట్టు మిషన్ శిక్షణను విజయవంతంగా పూర్తి చేశారు. శిక్షణ పూర్తి చేసిన మహిళలకు మంగళవారం అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ క్యాంప్ కార్యాలయంలో సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలకు వృత్తి నైపుణ్య శిక్షణ అందించడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. కుట్టు మిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకుని ఇంటి వద్ద నుంచే టైలరింగ్ పనులు చేపట్టి ఆదాయం పొందాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధిం చేందుకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసి సర్టిఫికెట్లు అందుకున్న మహిళలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. శిక్షణ ద్వారా పొందిన నైపుణ్యం భవిష్యత్తులో తమకు స్వయం ఉపాధికి ఎంతగానో ఉపయోగపడుతుం దని తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షులు ఫజిల్ బక్షి, మండల యువ నాయకుడు జూపల్లి ప్రమోద్, వెలుపుల సత్యనా రాయణ, కారం శ్రీను, సందీప్, కుంజగోపాల్, ఎస్.కె. నాసిర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## గురుకుల పాఠశాల గెస్ట్ ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి :ప్రిన్సిపల్ పరమేశ్వరి

**ఎర్రుపాలెం, అక్టోబర్ 6 (జనంసాక్షి):**
ఎర్రుపాలెం మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల (బాలికలు), ఏర్రుపాలెంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు బోధించేందుకు స్పెషల్ టీచర్ / గెస్ట్ స్పెషల్ ఎడ్యుకేటర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ఇంచార్జి ప్రిన్సిపల్ శ్రీమతి వేమిరెడ్డి పరమేశ్వరి తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు బి.ఎడ్. స్పెషల్ ఎడ్యుకేషన్ పూర్తి చేసి ఉండాలి.
ఎంపికైన అభ్యర్థులు నవంబర్ 2026 నుంచి మార్చి 2027 వరకు తాత్కాలిక ప్రాతిపదికన విధులు నిర్వహించాల్సి ఉంటుంది. నెలకు రూ.16,500 గౌరవ వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు అక్టోబర్ 8వ తేదీలోపు కళాశాలలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ పరమేశ్వరి ఒక ప్రకటన తెలిపారు.
**సెల్: 9705440212** ఈ మొబైల్ ఫోన్ చేసి సందేహాలు సలహాలు అవసరమైన వారు సంప్రదించి తెలుసుకోగలరని కోరారు.

# జాతీయ స్థాయిలో సూర్యాపేట పెసర్లకు రికార్డు ధర

## క్వింటా రూ.9200 ధర పలికిన పెసర్లు

**సూర్యాపేట (జనంసాక్షి):**
సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కు ప్రస్తుత సీజన్ లో రైతులు తీసుకొస్తున్న పెసర్లకు జాతీయ స్థాయిలో రికార్డు ధర వచ్చినట్లు సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మార్కెట్ సెక్రటరీ ఎండి.ఫసీయోద్దీన్ తెలిపారు.ప్రభుత్వం పెసర్లకు మద్దతు ధర క్వింటా రూ.8780 ప్రకటించగా సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కు రైతులు తెచ్చిన పెసర్లకు అంతకు మించి క్వింటా రూ.9200ల ధర వచ్చిందన్నారు. ఈ ధర దేశంలోని పెసర మార్కెట్లలో పడే ధర కంటే అధికమన్నారు.దేశంలోనే అతి పెద్ద పెసర మార్కెట్ గా ఉన్న మహారాష్ట్రలోని అకోలా మార్కెట్లో క్వింటా రూ 8851 ధర రాగా, తమిళనాడులోని సేలం మార్కెట్ లో క్వింటా రూ.6వేలు పడిందన్నారు.మన ప్రాంతంలోని రైతులు చెత్త చెదారం లేకుండా పరిశుభ్రమైన పెసర్లను మార్కెట్ కి తీసుకొస్తుండడంతో ఈ నామ్ లో పోటీతత్వంతో ధర పెరుగుతుందన్నారు.అంతే కాకుండా మన రైతులు పండించిన పెసర్లు దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయని, ఇది సూర్యాపేటకు దక్కిన అరుదైన గౌరవమన్నారు.



సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కి వచ్చిన రైతు కళ్ళల్లో ఆనందం నింపేలా పాలకవర్గం, అదికారులు ఎప్పటికప్పుడు ధరలను పర్యవేక్షిస్తూ రైతుల ఉత్పత్తులకు మంచి ధరలు పడేలా కృషి చేస్తున్నామన్నారు.



# మాదిగ విద్యార్థి ఫెడరేషన్ సభకు తరలిన నాయకులు

**బీబీనగర్ ( జనంసాక్షి):**
ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపు మేరకు మాదిగ విద్యార్థి ఫెడరేషన్ ప్రతినిధుల సభకు ఉస్మానియా యూనివర్సిటీ హైదరాబాద్ కు మంగళవారం బీబీనగర్ మండలం నుంచి నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పొట్ట వెంకటేశ్వర్లు, ఎం ఎస్ పి మండల అధ్యక్షులు మద్దూరి నర్సింగరావు మాదిగ మాట్లాడుతూ విద్యార్థి ఫెడరేషన్ జాతీయ ప్రతినిధుల సభ ముఖ్య ఉద్దేశం ఉన్నత విద్యా లక్ష్యం మరియు ఉపాధి కల్పన మరియు విద్యార్థుల భవిష్యత్ కార్యక్రమాల పై మాదిగ విద్యార్థులు మోటివేషనల్ ఆవ్వడానికి పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ముఖ్య ఉద్దేశం అని అన్నారు. వర్గీకరణ ఫలాలు విద్యార్థులు అందిపుచ్చుకోవడానికి విద్యను బలోపేతం చేయడానికి అన్నగారి యొక్క కార్యక్రమానికి సభను జయప్రదం చేయడానికి తరలినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు, సోమారం శంకర్, మాదిగ,మద్దూరి జంగయ్య, పొట్ట నవీన్ కుమార్. ఎంఎస్పి అధికార ప్రతినిధి దేవరకొండ రమేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు పెరుమండ్ల వంశీకృష్ణ, ఎమ్మార్పీఎస్ కోశాధికారి పొట్ట మహేష్ మాదిగ, ఎంఆర్పిఎస్ సాంస్కృతిక కార్యదర్శి ఒగ్గునాగరాజు మాదిగ , ఎమ్మార్పీఎస్ పట్టణ శాఖ అధ్యక్షులు గోల్కొండ మహేష్ మాదిగ, బ్రాహ్మణపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు పేరుమాండ్ల సంతోష్ మాదిగ, మాదిగ విద్యార్థి ఫెడరేషన్ మండల నాయకులు పొట్ట నరసింగా రావుమాదిగ ,పొట్ట వెంకటస్వామిమాదిగ, పొట్ట అనిల్ మాదిగ ,పొట్ట భరత్ కుమార్ మాదిగ ,మంచాల లాలయ్య,మాదిగ, పొట్ట దివాకర్ మాదిగ , గుండె వంశీ కుమార్ మాదిగ, రాపోలు రాము మాదిగ తిక్క సాయి కృష్ణ మాదిగ పాల్గొన్నారు.

# వికాస తరంగిణి ఆధ్వర్యంలో ప్రారంభమైన భజన పోటీలు

**సూర్యాపేట (జనంసాక్షి):**
ఉమ్మడి నల్లగొండ జిల్లా వికాస తరంగిణి శాఖ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలో భజన పోటీలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి.శ్రీచిన్నజీయర్ స్వామి వారి 70వ తిరునక్షత్రం పుట్టినరోజు వేడుకల సందర్భంగా గ్రామాలలో ఉండే కళాకారులను భజన బృందాలను ప్రోత్సహించుట కొరకు ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ కన్వీనర్ నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలచార్యులు తెలిపారు.ఈ పోటీలలో 38 భజన బృందాలు 600 భజనపరులు పాల్గొన్నారు.సూర్యాపేట వికాస తరంగిణి శాఖ ఆధ్వర్యంలో చేసిన ఏర్పాట్ల పట్ల భజనపరులు సంతోషం వ్యక్తం చేశారు.జిల్లా స్థాయిలో మొట్టమొదటిసారిగా సూర్యాపేటలో ఈ భజన పోటీలు నిర్వహించడం పట్ల గ్రామాలలో ఉన్న భజన బృందాల సభ్యులు హర్షనీయమని అన్నారు.పోటీలకు జడ్జిలుగా అక్కెర నాగేంద్ర చారి టీటీడీ ధర్మచార్యులు, గంగుల శ్రీనివాస్, పుల్లూరి ఉమా టిటిడి భజన బృందాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమాలలో భాగంగా నేడు కోలాటం, చెక్కభజన బృందాల పోటీలు నిర్వహిస్తున్నామని వేణుగోపాలచార్యులు తెలిపారు.






# చిలుకూరు ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

**చిలుకూరు, అక్టోబర్ 06 (జనంసాక్షి):**
మండల కేంద్రంలోని వివిధ పత్రికలకు చెందిన పాత్రికేయులతో కలిసి నూతన ప్రెస్ క్లబ్ కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఏన్నుకున్నారు. నూతన కమిటీ గౌరవ సలహాదారుగా గవిని ఆంజనేయులు,అధ్యక్షుడిగా షేక్ మీరాసాహేబ్ , ఉపాధ్యక్షుడిగా నూకపంగు వీరబాబు, ప్రధాన కార్యదర్శిగా కందుకూరి వంశీకృష్ణ, సహాయ కార్యదర్శిగా అమరగాని కృష్ణ గౌడ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా కందుకూరి కృష్ణమూర్తి , మల్లెపంగు ఉపేందర్ , బొలిశెట్టి నాగేంద్రబాబు , వేముల వెంకట్ , మహమ్మద్ ఐనుద్దిన్ లను ఎంపిక చేశారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన కమిటీ ద్వారా చిలుకూరు మండలంలోని ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. పాత్రికేయులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు, అధికారులకు మధ్య వారధిగా నిలిచేందుకు కృషి చేస్తామని అన్నారు.

# అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం

## గోగు వెంకటేశ్వర్లుకు ఉత్తమ సీసీ అవార్డు

**రామన్నపేట, అక్టోబర్ 6 (జనంసాక్షి):**



యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లాలో వృద్ధుల సంఘాలను ఎక్కువగా ఏర్పాటు చేసిన సీసీగా గోగు వెంకటేశ్వర్లుకు ఉత్తమ అవార్డు అందజేశారు.జిల్లాలో వయోవృద్ధుల సంక్షేమం కోసం కృషి చేస్తూ ఎక్కువ సంఘాలను ఏర్పాటు చేయడంలో విశేష కృషి చేసినందుకు ఈ అవార్డును ప్రదానం చేశారు. డీఆర్డీవో నాగిరెడ్డి, సెర్ప్ సదరం పీఎం శైలజ చేతుల మీదుగా గోగు వెంకటేశ్వర్లు అవార్డును అందుకున్నారు.

# జెర్రిపోతులగూడెం పాఠశాలకు మైకు బహూకరణ

**చిలుకూరు, అక్టోబర్ 06 (జనంసాక్షి):**



చిలుకూరు మండలం జెర్రిపోతులగూడెం ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన మద్ది లచ్చిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు మద్ది ప్రభాకర్‌రెడ్డి, ప్రియాంక దంపతులు మైకును బహూకరించారు. పాఠశాలలో ప్రార్థన, స్కూల్ అసెంబ్లీ కార్యక్రమాలతో పాటు వందేమాతరం, జనగణమన, తెలంగాణ తల్లి పాటలను సౌండ్ సిస్టమ్ ద్వారా నిర్వహించేందుకు మైకు ఉపయోగపడుతుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఛైర్మన్ గండు సుజాత, ప్రధానోపాధ్యాయులు కోలిసెట్టి నాగేశ్వరరావు, యం సురేష్, అంకతి మల్లిఖార్జునరావు, బత్తిని మమత, శైలజ, గోపిరెడ్డి ఆస్మ, దాతలను అభినందించారు. పాఠశాల అవసరాన్ని గుర్తించి మైకును అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.

# వార్డు సభ్యుల ఫోరం కమిటీ అధ్యక్షుడిగా - బెల్లంకొండ సైదులు

## మహిళా విభాగం అధ్యక్షురాలిగా - రామినేని సీతమ్మ

**చిలుకూరు, అక్టోబర్ 06(జనంసాక్షి):**



తెలంగాణ వార్డు సభ్యుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షురాలు నాగబెల్లి జ్యోతి మహేష్ ఆదేశాల మేరకు సూర్యాపేట జిల్లా వార్డు సభ్యుల ఫోరం ఇంచార్జీ షేక్ నజీర్ పాషా సమన్వయంతో కోదాడ నియోజకవర్గ ఇంచార్జీ బట్టు చంద్రకళ ఠాకూర్ నాయక్ నేతృత్వంలో చిలుకూరు మండల వార్డు సభ్యుల ఫోరం కమిటీని ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు.మండల అధ్యక్షుడిగా బెల్లంకొండ సైదులు,వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వేమూరి కృష్ణయ్య, గౌరవ అధ్యక్షుడిగా తలారి శ్రీనివాసరావు, గౌరవ సలహాదారుగా రెమిడాల రాజు, ఉపాధ్యక్షులుగా రావులపెంట శ్రీనివాసరావు, మండవ నాగయ్య, పదిరి వీరబాబు, ఆరే రామారావు, రాము, ప్రధాన కార్యదర్శిగా షేక్ షకీర్ పాషా, కార్యదర్శులుగా రమేష్, బాలాజీ, వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీలుగా మామిడి బాలకృష్ణ, కె.గోపి, ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఉపేందర్, దొంగరి సతీష్, అధికార ప్రతినిధిగా గన్నె కోటేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల యూత్ ఇంచార్జ్‌గా అలవల భాస్కర్‌ను నియమించారు. మహిళా విభాగం మండల అధ్యక్షురాలిగా రామినేని సీతమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వంగూరి కంకరత్నం, ఉపాధ్యక్షులుగా పారపల్లి అరుణ, షేక్ జరీనా బేగం, బానోతు పార్వతీ, వెంకటమ్మ, కందుకూరి స్వప్నను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శులుగా షేక్ ఫాతిమా గోరె సాహెబ్, బర్మావత్ స్వాతి, జాయింట్ సెక్రటరీలుగా ములకలపల్లి మాధవి బిక్షం, వంగూరి జ్యోతి, మాధవి, యడవెల్లి ఉపేంద్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వార్డు సభ్యుల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ గనగాని రమేష్ గౌడ్, రాష్ట్ర లీగల్ సెల్ ఇంచార్జీ అందే రవికుమార్, రాష్ట్ర కోఆర్డినేటర్ పోగుల నాగార్జునరెడ్డి, సోషల్ మీడియా జిల్లా ఇంచార్జ్‌లు మదాసు నాగరాజు, జగదీష్ నాయుడు, వార్డు సభ్యుల ఫోరం మండల అధ్యక్షులు మిర్యాల శ్రీనుగౌడ్, సూరేపల్లి ఉప్పలయ్య, తుళ్లూరు కిషన్‌రావుతో పాటు చిలుకూరు మండలానికి చెందిన పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.